మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 18-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 289 Issue: 289

18 ఏప్రిల్ 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:01 సూర్యాస్తమయం - సా. 6:29 తిథి పాడ్యమి మ. 2:09 వరకు తరువాత విదియ సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం అశ్విని ఉ. 9:41 వరకు తరువాత భరణి యోగం ప్రీతి రా. 11:54 వరకు కరణం బవ మ. 2:09 వరకు భాలవ రా. 12:30o వరకు వర్జ్యం ఉ. 6:05 నుండి ఉ. 7:32 వరకు దుర్ముహూర్తం ఉ. 7:41 నుండి ఉ. 8:31 వరకు రాహుకాలం ఉ. 9:08 నుండి ఉ. 10:42 వరకు యమగండం మ. 1:49 నుండి మ. 3:22 వరకు గుళికాకాలం ఉ. 6:01 నుండి ఉ. 7:35 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:25 నుండి తె. 5:13 వరకు అమృత ఘడియలు రా. 2:52 నుండి తె. 4:18 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:50 నుండి మ. 12:40 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున


Published from Jagitial
Circulated to Telangana



## హర్మ్యూజ్ తెరిచాం: ఇరాన్

హార్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చీ ఈ మేరకు సోషల్ మీడియాలో దీనిపై శుక్రవారం ఒక ప్రకటన చేశారు. ఇకపై హార్ముజ్ జలసంధి అందరికీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇటీవలే అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య గురువారం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. పది రోజులపాటు కాల్పుల విరమణ కొనసాగనుంది.

టెహ్రాన్: ఈ నేపథ్యంలోనే హార్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నంత కాలం జలసంధి తెరిచి ఉంచే అవకాశం ఉంది. 'లెబనాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం అమలు నేపథ్యంలో హార్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నాం. ఈ ఒప్పందం అమలులో తరువాయి 2 వ పేజీలో...



## నేను తెరవనీయను: ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన ప్రకటన చేశారు. ఇరాన్ హర్మ్యూజ్ జలసంధిని పూర్తిగా తెరిచినట్లు ప్రకటించినప్పటికీ, అమెరికా మాత్రం తన బ్లాకేడ్‌ను ఎత్తివేయబోమని ఆయన స్పష్టం చేశారు. 'హర్మ్యూజ్ తెరిచి ఉంది.. కానీ ఇరాన్‌తో మా లావాదేవీ పూర్తయ్యే వరకు బ్లాకేడ్ కొనసాగుతుంది' అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ వేదికలో ప్రకటించారు.

వాషింగ్టన్: ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయ వాణిజ్య వర్గాల్లో కలకలం రేపాయి. ఇరాన్ సముద్ర మార్గం తెరవడం వల్ల చమురు ధరలు తగ్గి ఊరటనిచ్చినా, అమెరికా బ్లాకేడ్ కొనసాగుతుండటం ఉద్రిక్తతలను తగ్గించలేకపోయింది. అమెరికా-ఇరాన్ చర్చలు విజయవంతంగా సాగుతున్నాయి. త్వరలో ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు అణు అంశంపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ అధికంగా శుద్ధి చేసిన యురేనియంను మాకు అప్పగించడానికి సిద్ధంగా ఉంది.

# మహిళకు ఓటమి

## లోక్‌సభ వేదికగా 'ఆమె'కు అవమానం

### వీగిపోయిన మహిళా రిజర్వేషన్ బిల్లు

### అనుకూలంగా 298, వ్యతిరేకంగా 230 ఓట్లు

కేంద్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చి ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోయింది. శుక్రవారం లోక్‌సభ వేదికగా జరిగిన ఓటింగ్‌లో బిల్లు వీగిపోయింది. మహిళా రిజర్వేషన్ల అమలును వేగవంతం చేయడానికి, అలాగే కొత్త జనాభా గణన నిర్వహించకుండా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడానికి వీలు కల్పించే డీలిమిటేషన్ బిల్లును లోక్‌సభ తిరస్కరించింది.

న్యూఢిల్లీ: సుదీర్ఘ చర్చల అనంతరం ప్రవేశపెట్టిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు వీగిపోవడంతో మిగతా రెండు బిల్లులకు ఓటింగ్ అవసరం లేకుండా పోయింది. ఈ ఓటింగ్‌లో మొత్తం 528 మంది ఎంపీలు పాల్గొనగా, అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు వచ్చాయి. బిల్లు ఆమోదానికి కావాల్సిన ఓట్ల సంఖ్య 352. సభలో జరిగిన ఓటింగ్‌లో మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించలేకపోవడం వల్ల, రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు ఆమోదం పొందలేదని స్పీకర్ ఓం బిర్లా






రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు-2026: మహిళా రిజర్వే షన్లను 2029 నుంచే అమలు చేయడానికి వీలుగా గతంలోని జనగణనను పరిగణనలోకి తీసుకుని నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడం.



## కాళేశ్వరం యాక్షన్ షురూ!

### బరాజ్‌ల మరమ్మతులకు సమన్వయ కమిటీ

### పరీక్షిత్ మెహ్రా ఆధ్వర్యంలో 9 మందితో ఏర్పాటు

### మే 30వలోగా పరిశీలనలు పూర్తి చేయాలన్న ప్రభుత్వం

ప్రతిష్ఠాత్మక కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల మరమ్మతులు, శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది. కల్నల్ పరీక్షిత్ మెహ్రా ఆధ్వర్యంలో 9 మంది సభ్యులతో కమిటీని వేసింది. మే 30వ తేదీలోగా పరిశీలనలు పూర్తి చేయాలని కమిటీని ఆదేశించింది.

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఈవార్తలు): కల్నల్ పరీక్షిత్ మెహ్రా నీటిపారుదల, టన్నెలింగ్ నిపుణులు. మూడు బరాజ్‌ల పునరుద్ధరణ పనులను సమన్వయం చేయడం, నిర్ణీత కాల వ్యవధిలో ప్రాజెక్టును తిరిగి వినియోగంలోకి తీసుకురావడంపై కమిటీ పనిచేయనుంది. వారానికి రెండుసార్లు సమావేశమై పురోగతిని సమీక్షిస్తుంది. ప్రతిరోజు జరిగే పనులపై రోజువారీ పురోగతి నివేదికలను తరువాయి 2 వ పేజీలో...



### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,420 |
| వెండి (గ్రాము): | రూ.275 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,201 |

### విశ్వవాణి



ఆస్ట్రేలియా తీర ప్రాంతాల్లోని సముద్రపు అడుగున ఆక్టోపస్‌లు ఒక నగరాన్నే నిర్మించుకున్నాయి. ఒక్కో ఆక్టోపస్ ఒక్కో డెన్‌ను తయారు చేసుకున్నాయి. ఒక క్రమ పద్ధతిలో నిర్మించుకున్న 'ఆక్టాంటిస్'ను శాస్త్రవేత్తలే నివ్వెరపోయారు.


## ఉప్పుడు బియ్యం కొనండి

### కేంద్రమంత్రి ప్రహ్లాద్‌కు రేవంత్ బృందం వినతి



యాసంగి పంటకు సంబంధించి తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. ధాన్యం యాసంగి పంట బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు తెలంగాణ అనుకూలమని వారు కేంద్ర మంత్రికి తెలియజేశారు.

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఈవార్తలు): గత ఆరు యాసంగి సీజన్లలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సరఫరా గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుందని చెప్పారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర మంత్రి జోషిని ఆయన నివాసంలో కలిశారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్‌కు భారీ డిమాండ్ ఉన్నందున సరఫరా పెంచాలని ఇటీవల కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ విభాగం అధికారులు సూచించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణలో ఈ యాసంగి సీజన్‌లో 90 ఎల్ఎంటీ తరువాయి 2 వ పేజీలో...



## కేటీఆర్‌ను నమ్మేదెవరు?

### పాదయాత్ర చేస్తే ఏం ప్రయోజనం?

### పదేళ్లు ప్రజల్లోకి ఎందుకు వెళ్లలేదు?

### జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన సోదరుడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై విమర్శల దాడిని ఉద్ధృతం చేశారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో పలు సామాజిక సంఘాల నేతలతో భేటీ అయిన ఆమె, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై రాజీకయంగా అత్యంత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ ఎందుకు ప్రజల్లోకి పోలేదు? ఇప్పుడు పాదయాత్రలు చేస్తానంటే ఎవరు నమ్ముతారు?" అని ఆమె సూటిగా ప్రశ్నించారు.

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఈవార్తలు): కేటీఆర్ పాదయాత్ర ప్రస్తావనను ఎద్దేవా చేస్తూ, అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను పట్టించుకోని వారు ఇప్పుడు ప్రజల్లోకి వెళ్లడం వెనుక అర్థమేంటని నిలదీశారు. సామాజిక తెలంగాణే లక్ష్యంగా తాను కొత్త రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టానని, అందుకే తనకు అనేక కష్టాలు వచ్చాయని కవిత పేర్కొన్నారు. "అందరికీ తరువాయి 2 వ పేజీలో...



## అపార్ట్‌మెంట్లలో ఈవీ చార్జింగ్ పాయింట్లు

### తప్పనిసరి చేస్తూ సర్కారు కొత్త పాలసీ.. ఈవీల వాడకాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు

### చార్జింగ్ నెట్‌వర్క్‌ను విస్తరించాలని సీఎస్ ఆదేశం.. పర్యవేక్షణకు ప్రత్యేక డాష్‌బోర్డ్

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఈవార్తలు): తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వాడకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇకపై రాష్ట్రంలోని అపార్ట్‌మెంట్ భవనాల బేస్‌మెంట్‌లో ఈవీ ఛార్జింగ్ పాయింట్లను తప్పనిసరిగా ఏర్పాటు చేసేలా కొత్త విధానాన్ని రూపొందిస్తోంది. ఈ మేరకు ఇంధన శాఖ కసరత్తు చేస్తోందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ తెలిపారు. ఈ నిర్ణయంతో -2 వ పేజీలో...

## బ్యాంకులకు 'బంగారు' అవకాశం!



### దిగుమతుల కోసం 15 బ్యాంకులకు అనుమతి

### 2026 ఏప్రిల్ 1 నుంచి 2029 మార్చి 31 వరకు అమలు

న్యూఢిల్లీ: బంగారం, వెండి దిగుమతుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని 15 ప్రధాన బ్యాంకులకు పసిడి, వెండిని దిగుమతి చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) శుక్రవారం ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ అనుమతులు 2026 ఏప్రిల్ 1 నుంచి 2029 మార్చి 31 వరకు మూడేళ్ల పాటు అమల్లో ఉంటాయి. బులియన్ దిగుమతులను క్రమబద్ధీకరించడం, నియంత్రిత మార్గాల ద్వారా వాటిని ట్రాక్ చేయడం ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. దీని ద్వారా పారదర్శకతను పెంచడంతో పాటు, బంగారం, వెండి వ్యాపారంలో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి అధికారం పొందిన ఈ బ్యాంకుల్లో తరువాయి 2 వ పేజీలో...



## ఘోర బస్సు ప్రమాదం

## ప్రైవేట్ బస్సు దగ్ధం!

కూకట్‌పల్లి, ఏప్రిల్ 17 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో శుక్రవారం అర్ధరాత్రి ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. పిల్లర్ నెంబర్ 734 వద్ద శ్రీదుర్గా మహేశ్వరి ట్రావెల్స్‌కు చెందిన ఏసీ స్లీపర్ బస్సులో మంటలు చెలరేగాయి. మంటలు భారీగా తరువాయి 2 వ పేజీలో...



## రాశి ఫలాలు

18.4.2026

మేషం: సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. ఉద్యోగస్తులకు శుభవార్తలు అందుతాయి. వ్యాపారాలలో భాగస్తులతో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. నిరుద్యోగులకు కార్యసిద్ధి కలుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో కీలక నిర్ణయాలు అమలుచేస్తారు. ఆర్థిక అనుకూలత కలుగుతుంది.

వృషభం: మొండి బకాయిలు వసూలవుతాయి. చేపట్టిన పనులలో జాప్యం కలిగినప్పటికీ సకాలంలో పూర్తిచేస్తారు. మిత్రుల నుండి కీలక విషయాలు సేకరిస్తారు. సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. వ్యాపార ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

మిధునం: దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఉద్యోగాలలో అదనపు పని భారం వలన తగిన విశ్రాంతి లభించదు. వ్యాపారాలు మరింత మందగిస్తాయి. ఇంటాబయట గందరగోళ పరిస్థితులుంటాయి. నిరుద్యోగులకు నిరాశ తప్పదు. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారించడం మంచిది.

కర్కాటకం: చేపట్టిన పనులలో శ్రమాధిక్యత కలుగుతుంది. వ్యాపార వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. నిరుద్యోగుల ప్రయత్న లోపం వలన వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకోలేరు. కీలక వ్యవహారాలలో సన్నిహితులతో మాట పట్టింపులు ఉంటాయి. ధన వ్యవహారాలలో కొంత అప్రమత్తంగా వ్యవహరించాలి.

సింహం: అవసరానికి చేతికి డబ్బు అందుతుంది. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. గృహమున మిత్రులతో ఆనందంగా గడుపుతారు. మిత్రులతో కీలక విషయాలలో చర్చలు చేస్తారు. వృత్తి వ్యాపారాలలో నష్టాలు భర్తీ అవుతాయి. ఉద్యోగాలలో సమస్యలు తొలగుతాయి.

కన్య: ఆప్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. రావలసిన ధనం సకాలంలో చేతికి అందుతుంది. కుటుంబ సమస్యలు పరిష్కరించుకుంటారు. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వృత్తి, ఉద్యోగాలు ఉత్సాహంగా సాగుతాయి.

తుల: ఋణదాతల ఒత్తిడి నుండి బయటపడటానికి నూతన ఋణాలు చేస్తారు. జీవిత భాగస్వామితో ఊహించని వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనుల్లో అవరోధాలుంటాయి. కుటుంబ సభ్యులతో దూరప్రయాణ సూచనలున్నవి. వ్యాపారాలలో స్వల్ప ధన నష్టాలుంటాయి. వృత్తి ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి.

వృశ్చికం: కుటుంబ సభ్యుల ప్రవర్తన చికాకు పరుస్తుంది. ఉద్యోగమున అప్పగించిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించడంలో విఫలమౌతారు. వ్యాపారాలు కొంత నిదానంగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలించవు. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. ఆస్తి వ్యవహారాలలో సోదరులతో వివాదాలు కలుగుతాయి.

ధనస్సు: సంఘంలో ప్రముఖుల నుండి విశేషమైన ఆదరణ లభిస్తుంది. వ్యాపారాలలో వివాదాలకు సంభందించి కీలక సమాచారం అందుతుంది. వ్యాపారస్తులకు నూతన అవకాశములు అందుతాయి. మిత్రుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో ఓర్పుతో వ్యవహరించి సమస్యల నుండి బయటపడతారు.

మకరం: కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ఆకస్మిక ధన వ్యయ సూచనలున్నవి. వ్యాపారాలు మరింత మందకొడిగా సాగుతాయి. ఉద్యోగమున సహోద్యోగులతో మనస్పర్థలు కలుగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. ఋణ ప్రయత్నాలు కలసిరావు.

కుంభం: ఇంటా బయట కీలక నిర్ణయాలు తీసుకుంటారు. వృత్తి వ్యాపారమున వ్యవహార అనుకూలత కలుగుతుంది. పాత సంఘటనలు గుర్తు చేసుకుంటారు. నూతన ఉద్యోగ అవకాశములు లభిస్తాయి. ఉద్యోగమున ఆశించిన మార్పులు కలుగుతాయి. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు.

మీనం: వ్యాపారాలలో అలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. సన్నిహితుల నుండి అందిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. చేపట్టిన పనులు నిదానంగా పూర్తవుతాయి. ఉద్యోగాలలో శ్రమకు తగిన ఫలితం అందదు. సంతాన విద్యా ఫలితాలు ఆశించిన రీతిలో ఉంటాయి.

# మహిళకు ఓటమి



మొదటి పేజీ తరువాయి

తెలిపారు. దాంతో రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. దాంతో మిగతా రెండు బిల్లులు డీలిమిటేషన్, మహిళ రిజర్వేషన్ బిల్లులను ఉపసంహరించుకున్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. బిల్లులు ప్రవేశపెట్టేముందు కేంద్రమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. 'ఓబీసీలను వ్యతిరేకించే పార్టీల్లో కాంగ్రెస్ ముందుంటుంది. చరణ్ సింగ్, కేసరిలాంటి ఓబీసీలకు అన్యాయం చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది. ఓబీసీల కోసం కాకాసింగ్ కాలేకర్ చేసిన సూచనలను కాంగ్రెస్ తుంగలో తొక్కింది. మండల్ కమిషన్ ఇచ్చిన నివేదికను సైతం కాంగ్రెస్ ఆమోదించలేదు. వీపీ సింగ్ వచ్చిన తర్వాత మండల్ కమిషన్ రిపోర్టుకు మోక్షం దక్కింది. రాజీవ్ గాంధీ తన జీవితాంతం మండల్ కమిషన్ నివేదికను వ్యతిరేకిస్తూ వచ్చారు. 15-20 సార్లు ఎన్నికల్లో ఓడిపోయాక కాంగ్రెస్‌కు ఓబీసీలు గుర్తుకొచ్చారు. బీజేపీ మాత్రమే అత్యంత వెనకబడిన ఓబీసీ నాయకుడు మోదీని ప్రధానిని చేసింది. మోదీ ప్రభుత్వంలో 27మంది కేంద్రమంత్రులు ఓబీసీలే. మొత్తం క్యాబినెట్‌లో ఓబీసీల శాతం 40. 1992,72,73 సవరణల ద్వారా వీపీ నరసింహారావు పంచాయతీల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించారు. పీవీ నరసింహారావును ఎప్పుడూ కాంగ్రెస్ తన సొంత మనిషిగా భావించలేదు. 1996లో దేవేగౌడ 81వ సవరణ ద్వారా మహిళలకు రిజర్వేషన్లు ఇచ్చే ప్రయత్నం చేశారు. మహిళా బిల్లును బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకించలేదు. మన్మోహన్ ప్రభుత్వానికి మద్దతిచ్చిన పార్టీలే మహిళా బిల్లును



వ్యతిరేకించాయి. కాంగ్రెస్ కుట్రతోనే తన అనుకూల పార్టీలతో మహిళా బిల్లును వ్యతిరేకించింది. ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లును.. అడ్డుకుంటున్న వారికి ప్రజాక్షేత్రంలో మహిళలు బుద్ధి చెబుతారు' అని హెచ్చరించారు.

**బిల్లులివే..**

1. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు-2026: మహిళా రిజర్వే షన్లను 2029 నుంచే అమలు చేయడానికి వీలుగా గతంలోని జనగణనను పరిగణనలోకి తీసుకుని నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడం.
2. కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు-2026: అసెంబ్లీల్లో 33శాతం మహిళల కోటా అమలుకు వీలుగా కేంద్ర పాలిత ప్రాంతాలో నియోజకవర్గాల పునర్విభజనను చేపట్టడం.
3. డీలిమిటేషన్ బిల్లు-2026: దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడానికి వీలుగా డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేయడం.

ఈ బిల్లులు రాజ్యాంగంపై దాడి చేయడమే. రాజ్యాంగ విరుద్ధమైన బిల్లులను ఓడించాం. ఇది మహిళా బిల్లు కాదని స్పష్టంగా చెప్పాం. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మేం వ్యతిరేకం కాదు. మహిళా బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన బిల్లు ముమ్మాటికీ మహిళా బిల్లు కాదు. ఇది భారత రాజకీయ నిర్మాణంపై దాడి. దేశ రాజకీయ నిర్మాణాన్ని మార్చే కుట్రను అడ్డుకున్నాం. 2023 మహిళా బిల్లును ఆమోదించేందుకు సిద్ధమని ప్రధానికి చెబుతున్నా. 2023 మహిళా బిల్లును అమలు చేయండి.. పూర్తిగా సహకరిస్తాం.

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

ఈ పద్ధతిలో మహిళా బిల్లును పెట్టడాన్ని వ్యతిరేకించాం

- ప్రియాంకా గాంధీ

ఢిల్లీని ఓడించాం, - తమిళనాడు సీఎం స్టాలిన్

రాహుల్, ఖర్గే నేతృత్వంలో జాతీయ విపత్తును అడ్డుకున్నారు. దేశ చరిత్రలో సువర్ణదినంగా ఈ రోజు గుర్తుండిపోతుంది.

- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

# ఉప్పుడు బియ్యం కొనండి

మొదటి పేజీ తరువాయి

ధాన్యం ఉత్పత్తి అవుతుందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి వివరించారు. యాసంగి ధాన్యం బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలంగా ఉంటుందని, అందువల్ల యాసంగి పంటకు సంబంధించి మొత్తం 30 ఎల్ఎంటీ బాయిల్డ్ రైస్ (5 శాతం నూకతో), 5 ఎల్ఎంటీ రా రైస్ (10 శాతం నూకతో) సరఫరా చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రికి చెప్పారు. బాయిల్డ్ రైస్ సరఫరాకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదనకు కేంద్ర మంత్రి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు.

వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ అగ్రగామి

2014-15 వర్షాకాలం పంట అదనపు లెవీ సేకరణకు సంబంధించిన రూ. 1,468.94 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దేశంలోనే వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ అగ్రగామిగా ఉందని, ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులకు తాము చెల్లింపులు చేస్తున్నామని



తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మీద ఉన్న ఒత్తిడిని గుర్తించి వెంటనే పాత బకాయిలు విడుదల చేయాలని కోరారు. పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపాల నివారణకు గాను పోషకాహార బియ్యాన్ని పాఠశాలలు, వసతిగృహాలు, ఐసీడీఎస్ పరిధిలో పంపిణీ చేసేవారని, ఇటీవల దానిని నిలిపివేశారని పేర్కొంటూ వెంటనే పునఃప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో జరిగిన సమావేశంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్, సెక్రటరీ కో-ఆర్డినేషన్ అద్వైత్ సింగ్‌తోపాటు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌ను నమ్మేదెవరు?

మొదటి పేజీ తరువాయి

అధికారం అందాలని నేను మాట్లాడటం మొదలుపెట్టాకే నాకు సమస్యలు ఎదురయ్యాయి. బీఆర్ఎస్ నన్ను సస్పెండ్ చేసినా, సామాజిక తెలంగాణ సాధించే వరకు నా పోరాటం ఆగదు" అని ఆమె స్పష్టం చేశారు. తన కొత్త పార్టీకి మారోజు వీరన్న అనుచరులు, సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ వంటి బహుజన సంఘాలు మద్దతు తెలపడం తనకు కొండంత బలాన్ని ఇస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. వీరన్న అనుచరులు తనతో కలవడమంటే ఇక తమను ఆపే శక్తే లేదని ఆమె ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన కొందరు మాజీ ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారని, సమయం వచ్చినప్పుడు వారి పేర్లు బయటపెడతానని బాంబు పేల్చారు. గ్రహగతులు అనుకూలించాలని, ఏదైనా శని అడ్డు ఉంటే తొలగిపోవాలని వారణాసిలో పూజలు చేసినట్లు కూడా ఆమె వెల్లడించారు.

# హర్మూజ్ తెరిచాం: ఇరాన్

మొదటి పేజీ తరువాయి

ఉన్నంతకాలం హోర్ముజ్‌ను అందరికీ అందుబాటులోకి తెస్తున్నాం. అన్ని రకాల వాణిజ్య నౌకల్ని అనుమతిస్తాం. ఈ అంశంపై ఇప్పటికే అన్ని పోర్టులకు సమాచారం అందించాం. సంబంధిత రూట్ల గురించి కూడా తెలియజేశాం' అని అరాగ్చీ తన పోస్టులో పేర్కొన్నారు.

# అపార్ట్‌మెంట్లలో ఈవీ చార్జింగ్ పాయింట్లు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాదీలకు ఇళ్లలోనే సులువుగా ఛార్జింగ్ చేసుకునే సౌకర్యం కలగనుంది. శుక్రవారం నాడు సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధ్యక్షతన ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నవీన్ మిట్టల్ ఈ విషయాన్ని వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛమైన ఇంధన వినియోగం లక్ష్యంగా ఈవీల వాడకాన్ని వేగవంతం చేయాల్సిన అవసరాన్ని సీఎస్ నొక్కిచెప్పారు. ఈవీ వినియోగదారుల్లో విశ్వాసం పెంచేందుకు బలమైన, విస్తృతమైన ఛార్జింగ్ నెట్‌వర్క్ చాలా కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో సమగ్రమైన ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఛార్జింగ్ సౌకర్యాలు సులభంగా, విశ్వసనీయంగా ఉండేలా చూడాలన్నారు. అలాగే, రాష్ట్రంలోని ఈవీ ఛార్జింగ్ కేంద్రాలను మ్యాప్ చేయడానికి, పర్యవేక్షించడానికి ఒక కేంద్రీకృత, రియల్-టైమ్ డాష్‌బోర్డ్‌ను అభివృద్ధి చేయాలని కూడా సీఎస్ సూచించారు. ఈ సమీక్షలో రవాణా, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, టీజీఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, రవాణా కమిషనర్ ఇళంబరితి, టీజీఐఐసీ వీసీ, ఎండీ శశాంక, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, టీజీరెడ్కో ఎండీ అనీల వావిళ్ల, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఘోర బస్సు ప్రమాదం ప్రైవేట్ బస్సు దగ్ధం!

మొదటి పేజీ తరువాయి

ఎగిసిపడటంతో అగ్నికీలలు బస్సును చుట్టుముట్టాయి. సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది, మంటలు ఆర్పడంలో నిమగ్నమైంది. ప్రమాదానికి కారణం షార్ట్ సర్క్యూట్ అని తెలుస్తోంది. తొలుత డ్రైవర్ క్యాబిన్‌లో మంటలు వచ్చాయి. దీంతో.. అప్రమత్తమైన డ్రైవర్ బస్సులోని 18 మంది ప్రయాణికులను కిందికి దించేశారు. తరువాత మంటలు క్రమంగా బస్సు మొత్తం వ్యాపించాయి. దీంతో రోడ్డుపై భారీ ట్రాఫిక్ ఏర్పడింది.

# బ్యాంకులకు 'బంగారు' అవకాశం!

మొదటి పేజీ తరువాయి

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యెస్ బ్యాంక్ వంటి దిగ్గజ ప్రైవేట్, ప్రభుత్వ రంగ బ్యాంకులు ఉన్నాయి. అయితే, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్బేర్‌బ్యాంక్‌లకు మాత్రం కేవలం బంగారం దిగుమతికి మాత్రమే అనుమతి లభించింది. ఈ నేపథ్యంలో, దేశంలో బంగారం మార్కెట్ సరళిపై ప్రపంచ స్వర్ణ మండలి (వరల్డ్ గోల్డ్ కౌన్సిల్) విడుదల చేసిన నివేదిక ఆసక్తికర విషయాలను వెల్లడించింది. దీని ప్రకారం, 2026 మార్చి నెలలో భారత్ బంగారం దిగుమతులు భారీగా తగ్గి 9 నెలల కనిష్ఠ స్థాయికి చేరాయి. ఆ నెలలో కేవలం 3.1 బిలియన్ డాలర్ల విలువైన పసిడి మాత్రమే దిగుమతి అయింది. పరిమాణం పరంగా చూస్తే ఇది 20-25 టన్నులు మాత్రమే. సాధారణంగా 12 నెలల సగటు దిగుమతి 62 టన్నులుగా ఉండగా, అందులో ఇది చాలా తక్కువ. మధ్యప్రాచ్యం నుంచి విమాన రాకపోకలకు అంతరాయాలు కలగడం, డిమాండ్ తగ్గడం వంటివి ఇందుకు కారణాలని నివేదిక పేర్కొంది. అయితే, మార్చిలో పడిపోయిన బంగారం ధరలు ఏప్రిల్‌లో పాక్షికంగా కోలుకున్నాయి. దిగుమతులపై ఆంక్షలు, సరఫరా సమస్యల కారణంగా దేశీయ మార్కెట్‌లో డిస్కౌంట్లు తగ్గాయి. ఇదే సమయంలో, 2026 మొదటి త్రైమాసికంలో లిస్టెడ్ జ్యువెలరీ సంస్థలు బలమైన వృద్ధిని నమోదు చేశాయి. వివాహాల సీజన్, అధిక విలువైన కొనుగోళ్లు, సంస్థల విస్తరణ ఇందుకు దోహదపడ్డాయని తెలిపింది. మరోవైపు, పెట్టుబడిదారుల్లో బంగారంపై ఆసక్తి కొనసాగుతోంది. భారత గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి వరుసగా 11వ నెల కూడా పెట్టుబడులు వెల్లువెత్తాయి. మార్చిలో నికరంగా రూ. 22.7 బిలియన్ల (244 మిలియన్ డాలర్లు) పెట్టుబడులు వచ్చినట్లు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా గణాంకాలు చెబుతున్నాయి. అలాగే, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా డిజిటల్ గోల్డ్ కొనుగోళ్లు కూడా బలంగానే ఉన్నాయి. ఫిబ్రవరిలో రూ. 30.3 బిలియన్ల విలువైన డిజిటల్ బంగారం కొనుగోళ్లు జరిగాయని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ వివరించింది.

# కాళేశ్వరం యాక్షన్ షురూ!

మొదటి పేజీ తరువాయి

సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. వర్షాకాలం ప్రారంభానికి ముందే కీలకమైన పరీక్షలను పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు విధించింది. బరాజ్‌ల పునాదుల పటిష్ఠతను తెలుసుకోవడానికి మే 30వ తేదీ లోపు జియో టెక్నికల్, జియో ఫిజికల్ పరీక్షలు పూర్తి చేయాలని ఆదేశించారు. సెంట్రల్ వాటర్ కమిషన్, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనలు, అనుమతుల మేరకు మాత్రమే ఈ మరమ్మతులు సాగనున్నాయి. ముందుగా అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి, మేడిగడ్డను పాక్షికంగానైనా వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

బరాజ్ పనులు వేగవంతం: ఉత్తమ్

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్ పునరుద్ధరణ పనులను పూర్తిగా శాస్త్రీయ విధానంలో, పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఢిల్లీ లో ఉన్న రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్ తో భేటీ అయ్యారు. బరాజ్‌ల రిపేర్లు, పునరుద్ధరణకు సంబంధించి ప్రభుత్వం చేపడుతున్న కార్యాచరణ ప్రణాళికను చర్చించారు. గతంలో జరిగిన లోపాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తీసుకుంటున్న ముందు జాగ్రత్తలను వివరించారు. అన్ని కోణాల్లో నిపుణుల ఆధ్వర్యంలో ప్రస్తుతం పరీక్షలు చేపడుతున్న తీరుపై ఎన్డీఎస్ఏ చైర్మన్ సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే తాను స్వయంగా బరాజ్‌లను సందర్శనకు వస్తానని చెప్పారు. బరాజ్‌ల పునరుద్ధరణ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే నిపుణుల సంస్థలను ప్రభుత్వం నియమించింది. డిజైనింగ్, టెస్టింగ్ సంస్థలు రంగంలోకి దిగాయి. డిజైన్‌కు ముందు అవసరమైన పరీక్షలు, అధ్యయనాలను సీడబ్ల్యూపీఆర్ఎస్ సంస్థ చేస్తుంది. బరాజ్‌ల పునరుద్ధరణ కోసం జీపీఆర్ (గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్) స్కానింగ్ , డ్రోన్ సర్వేలు, బోర్ హోల్స్ , జియోటెక్నికల్ , జియోఫిజికల్ పరీక్షలతో భూమి, అక్కడ నిర్మాణాల సామర్థ్యం ఎలా ఉందో తెలుసుకోనున్నారు. కాగా, గత ప్రభుత్వ లోపాల వల్ల దెబ్బతిన్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను శాస్త్రీయ పద్ధతుల్లో బాగు చేయడమే తమ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకోసం ఎన్డీఎస్ఏ, సీడబ్ల్యూసీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, ఐఐటి ముంబయిలోని నిపుణుల సహకారంతో అత్యధునాతన పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఈ నెలాఖరులోగా భూసార పరీక్షలు పూర్తి చేసి, వర్షాకాలం తర్వాత శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. పారదర్శకత కోసం ప్రత్యేక కో ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేశాము. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా బరాజ్‌లను క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు.

# బిల్లు వీగిపోవడానికి కారణం బీజేపీనే: కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఈవార్తలు): లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. బీజేపీ పన్నిన కుటిల రాజకీయాల వల్లే దేశంలోని మహిళా లోకానికి దక్కాల్సిన రిజర్వేషన్లు వెంటనే దక్కకుండా పోయాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ సహా దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు ఈ బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతు పలికినప్పటికీ, బీజేపీ కావాలనే డీలిమిటేషన్ పేరుతో చిక్కుముళ్లు తెచ్చిపెట్టి బిల్లు విఫలమయ్యేలా చేసిందని ఆరోపించారు. మహిళా సాధికారతపై బీజేపీకి ఉన్న చిత్తశుద్ధి నేటి పరిణామాలతో తేలిపోయిందని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అనవసరంగా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంతో ముడిపెట్టడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. ప్రస్తుతం ఉన్న 543 లోకసభ సీట్లతోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేసి ఉంటే ఎటువంటి సమస్య వచ్చేది కాదని, కానీ మహిళల రిజర్వేషన్ల అంశాన్ని ముడిపెట్టి దేశ మహిళల భుజాల మీద నుంచి దక్షిణాది రాష్ట్రాల గొంతు కోయాలని బీజేపీ చూసిందని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను, డీలిమిటేషన్ పర్యవసానాలను పట్టించుకోకుండా మొండిగా ముందుకు పోవడంతో ఒక చారిత్రక అవకాశం జారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో బీజేపీ ఆడిన నాటకాన్ని దేశ ప్రజలు కళ్లారా చూశారని కేటీఆర్ అన్నారు. కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసం మహిళలను వాడుకుని, ఇప్పుడు వారిని వెన్నుపోటు పొడిచిన పార్టీగా బీజేపీ చరిత్రలో నిలిచిపోతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా బీజేపీ తన నిజాయతీని నిరూపించుకోవాలంటే, డీలిమిటేషన్ నిబంధన లేకుండా కేవలం మహిళా రిజర్వేషన్ల కోసమే ఒక కొత్త బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల నుంచే దాన్ని అమలు చేయాలని అన్నారు. దేశంలోని అనేక పార్టీలు డీలిమిటేషన్ అనే అంశం అత్యంత సంక్లిష్టమైనదని చెప్పాయని తెలిపారు. ప్రస్తుత విధానంలో దక్షిణ భారతదేశానికి పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గడం ప్రమాదకరమని స్పష్టంగా చెప్పిన విషయాన్ని బీజేపీ గుర్తించాలని అన్నారు. ఇప్పటికైనా దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని డీలిమిటేషన్ అంశంపై విస్తృతమైన చర్చ, సంప్రదింపులు చేపట్టాలని సూచించారు. డీలిమిటేషన్ అంశంపై మొండిగా ముందుకుపోవడం కుదరదనే



విషయం ఈరోజు లోక్ సభలో జరిగిన పరిణామాలను బట్టి బీజేపీ తెలుసుకోవాలని అన్నారు. దీనితో పాటు తెలంగాణ పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రంలో అసెంబ్లీ సీట్ల పెంపు అనేది మా రాష్ట్ర హక్కు అని కేటీఆర్ అన్నారు. జమ్ము కశ్మీర్, అసోంలో దేశవ్యాప్త డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా సీట్ల పెంపు చేపట్టిన కేంద్రం, తెలంగాణ విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందని ప్రశ్నించారు. మహిళా బిల్లుతో, దేశవ్యాప్త డీలిమిటేషన్ అంశం సంబంధం లేకుండా, తెలంగాణ అసెంబ్లీ సీట్లను 2028 లోపు పెంచేలా ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రత్యేక బిల్లు తీసుకురావాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించిన బీఆర్ఎస్వీ

నాంపల్లి-హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఈవార్తలు): కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య తెలంగాణ ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్వీ నాంపల్లిలోని బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించింది. పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ విభజనను పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలపై వారు మండిపడ్డారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలను, తెలంగాణ ప్రజల మనోభావాలను బీజేపీ ఎంపీ కించపరిచాడని అన్నారు. తన వ్యాఖ్యలకు గాను బీజేపీ ఎంపీ వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. బీజేపీ కార్యాలయం ఎదుట తేజస్వీ సూర్య చిత్రపటాన్ని దగ్ధం చేశారు. బీజేపీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నేతల హంగామా నేపథ్యంలో బీజేపీ కార్యకర్తలు వారిని అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు బీఆర్ఎస్వీ నేతలను అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్యపై ఢిల్లీలో పోలీసులకు ఫిర్యాదు చేయాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. తెలంగాణ, ఏపీ విభజనను భారత-పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ వ్యాఖ్యలు చేయడానికి నిరసనగా బీజేపీ ఎంపీపై పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి ఫిర్యాదు చేయనున్నారు.

# రోహిత్ వేముల చట్టంపై కేబినెట్ సబ్ కమిటీ

**ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం**

**డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు**

**కమిటీలో ఉత్తమ్, దామోదర, శ్రీధర్ బాబు, పొన్నం**

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఈవార్తలు): తెలంగాణలోని ఉన్నత విద్యాసంస్థల్లో సామాజిక గుర్తింపు ఆధారిత వివక్షను నిరోధించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై "రోహిత్ వేముల తెలంగాణ (ఉన్నత విద్యలో గుర్తింపు ఆధారిత వివక్ష నివారణ) బిల్లు, 2026" రూపకల్పన కోసం ఒక కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఈ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనరసింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఇందులో సభ్యులుగా ఉంటారు. ఈ బిల్లుపై అధ్యయనం చేసి, చట్ట రూపకల్పనకు అవసరమైన సిఫార్సులు, సూచనలను సబ్ కమిటీ ప్రభుత్వానికి అందిస్తుంది. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జీవో ఆర్టీ నెం.490ని జారీ చేశారు. వీలైనంత త్వరగా తమ నివేదికను సమర్పించాలని కేబినెట్ సబ్ కమిటీని ఆదేశించారు.

# దక్షిణాదికి అన్యాయం జరగదు

## రేవంత్ ఫార్ములా వెనుక అసదుద్దీన్: కిషన్ రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఈవార్తలు): నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై తెలంగాణలో సాగుతున్న ప్రచారాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలో మీడియా ముఖంగా మాట్లాడిన ఆయన... ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ 'నార్త్ వర్సెస్ సౌత్' వివాదాన్ని సృష్టించేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు ప్రధాని మోదీ సమన్యాయం చేస్తారని, జనాభా ప్రాతిపదికన సీట్ల విభజన జరిగినా దక్షిణాది ప్రాధాన్యత తగ్గబోదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏపీలో సీట్లు 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కు, తమిళనాడులో 39 నుంచి 59కి పెరిగే అవకాశం ఉందని ఆయన గణాంకాలను వివరించారు. మరోవైపు, మహిళా రిజర్వేషన్ బిల్లుపై కూడా కిషన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. మజ్లిస్ పార్టీ తన సీట్లు ఎక్కడ పోతాయో అన్న భయంతో మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తోందని, ఆ పార్టీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ వత్తాసు పలుకుతున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన హైబ్రిడ్ ఫార్ములా అసలు ఆయనది కాదని, అది అసదుద్దీన్ ఓవైసీ వెనుక ఉండి చెప్పించిన ఫార్ములా అని ఆయన ఆరోపించారు. కేవలం హైదరాబాద్‌లో ఎక్కువ ఆదాయం వస్తుందని అక్కడ సీట్లు పెంచమంటారా? అని ప్రశ్నించిన ఆయన... డబ్బున్న చోట ఓటు విలువ ఎక్కువగా ఉండాలని కోరుకోవడం ఏ రకమైన ప్రజాస్వామ్యం అని నిలదీశారు. మహిళలను అణగదొక్కే రాజకీయాలకు ఎంఐఎం కేంద్ర బిందువుగా మారిందని, విపక్షాలన్నీ కలిసి మహిళా నాయకత్వాన్ని అడ్డుకుంటున్నాయని ధ్వజమెత్తారు.

## స్టాండప్ కమెడియన్‌పై భట్టికి ఫిర్యాదు

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఈవార్తలు): స్టాండప్ కామెడీ పేరుతో మెగా ఫ్యామిలీ సభ్యులపై వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారంటూ కమెడియన్ అనుదీప్ కటికలపై అఖిల భారత చిరంజీవి యువత తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై వెంటనే స్పందించిన ఆయన, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం వన్ కల్యాణ్, నటుడు రామ్ చరణ్ గారు, నిర్మాత, నటి నిహారిక వ్యక్తిగత జీవితాలను కించపరిచేలా అనుదీప్ కటికల వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్టాండప్ కామెడీ ముసుగులో వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సరికాదని అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రవణం స్వామినాయుడు, తెలంగాణ చిరంజీవి యువత అధ్యక్షుడు వెల్పుల వెంకటేశ్ తెలిపారు.

## ఉప్పల్ మెట్రోకు బాంబు బెదిరింపు

ఉప్పల్-హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలోని ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్‌కు బాంబు బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. మెట్రో స్టేషన్‌లో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. మెట్రో రైలు స్టేషన్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన పోలీసులు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో అనుమానాస్పద వస్తువులు ఏవీ లభించకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

## లంచగొండి సీఐ

**2 లక్షలు తీసుకుంటూ దొరికిన పోలీస్**

**కామారెడ్డి జిల్లాలో ఘటన**

కామారెడ్డి, ఏప్రిల్ 17 (ఈవార్తలు): కామారెడ్డి జిల్లాలో ఓ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. బిచ్కుంద ఎక్సైజ్ సీఐగా పనిచేస్తున్న దీను సత్యనారాయణ రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే... ఓ వ్యక్తి తన కల్లు దుకాణాన్ని మరో గ్రామానికి మార్చుకోవడానికి అనుమతి కోరాడు. అదే సమయంలో తనపై ఎలాంటి కేసులు నమోదు చేయవద్దని కూడా విజ్ఞప్తి చేశాడు. ఈ పని చేసిపెట్టడానికి సీఐ సత్యనారాయణ బాధితుడి నుంచి లంచం డిమాండ్ చేశాడు. దీంతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఫిర్యాదు స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. బిచ్కుందలోని సీఐ అద్దె ఇంట్లో బాధితుడి నుంచి రూ.2 లక్షలు తీసుకుంటుండగా అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సీఐ వద్ద అదనంగా లభించిన రూ.45,670 నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.



# కొత్తగా 79 డయాలసిస్ కేంద్రాలు

## తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం


హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఈవార్తలు): తెలంగాణలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారికి మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 79 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. మారుమూల ప్రాంతాల్లోని రోగులు డయాలసిస్ కోసం పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొత్త కేంద్రాలను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌లో నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులు ప్రధాన హబ్‌లుగా వ్యవహరిస్తూ, మిగిలిన కేంద్రాలకు సాంకేతిక మార్గదర్శకత్వం అందిస్తాయి. కొత్త కేంద్రాలతో పాటు ఇప్పటికే ఉన్న 67 డయాలసిస్ సెంటర్లలో అదనంగా 155 యంత్రాలను ఏర్పాటు చేసి పడకల సామర్థ్యాన్ని కూడా పెంచనున్నారు. ప్రతి 25 కిలోమీటర్ల పరిధిలోను ఒక డయాలసిస్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ ఆలోచన. ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, ఆసిఫాబాద్ వంటి ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కొత్త కేంద్రాల ద్వారా మొత్తం 416 పడకలు అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో కేంద్రంలో 5 నుంచి 10 డయాలసిస్ యంత్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ నిర్ణయంతో కిడ్నీ రోగులు చికిత్స కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది. అత్యవసర సమయాల్లోనూ వేగంగా వైద్యం అందే అవకాశం కలుగుతుంది. ఈ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన టెండర్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎంఎస్ఐడీసీ) అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

# తేజస్వీ.. అజ్ఞాని

## కోదండరాం నిప్పులు



హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఈవార్తలు): తెలంగాణ అస్తిత్వాన్ని, అమరుల త్యాగాలను కించపరిచేలా బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలు చేశారని తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏమాత్రం సందర్భం లేకుండా, కనీస అవగాహన లేకుండా తెలంగాణ ఏర్పాటును బ్రిటిష్ కాలం నాటి పరిస్థితులతో ముడిపెట్టడం శోచనీయమని మండిపడ్డారు. రాజ్యాంగంలోని ఆర్టికల్-3 ప్రకారం, అత్యున్నత ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఏర్పాటైన రాష్ట్రాన్ని కించపరచడం అంటే భారత రాజ్యాంగాన్ని అవమానించడమేనని అన్నారు. తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షను నాటి బీజేపీ అగ్రనేతలు సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ గౌరవించి, మద్దతు తెలిపిన విషయాన్ని కోదండరాం ఈ సందర్భంగా గుర్తు చేశారు. సొంత పార్టీ సీనియర్ నేతలు తీసుకున్న నిర్ణయాలను కూడా అర్థం చేసుకోకుండా తేజస్వి సూర్య మాట్లాడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ అంత బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతుంటే పక్కనే ఉన్న కేంద్ర మంత్రులు ఆయన్ని నిలువరించకపోవడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు ఈ వ్యాఖ్యలను ఖండించకపోవడాన్ని బట్టి చూస్తే, వారికి రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమని అర్థమవుతోందని విమర్శించారు. తేజస్వి వ్యాఖ్యలను తక్షణమే పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించాలని, ఆయనపై బీజేపీ అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## ముత్యంపేటలో ఘనంగా పోషణ పక్షం

మల్యాల, ఏప్రిల్ 17 (ఈవార్తలు): మల్యాల మండలం ముత్యంపేటలో సెక్టర్‌లోని ముత్యంపేటలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆదిరెడ్డి మాట్లాడుతూ.. బాల్య వివాహాలను నిరోధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముత్యం రెడ్డి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ పవిత్ర, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాజయ్య, హెల్త్ సూపర్ వైజర్ రాజమ్మ, అంగన్వాడీ టీచర్లు శోభ, గంగ, శారద, పద్మ, మమత, ఆశాలు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



## అన్నదానం.. ఎంతో పుణ్యకార్యం: లక్ష్మణ్ రావు

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఈవార్తలు): ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని భజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు అన్నారు. పవిత్రమైన అమవాస్య సందర్భంగా శుక్రవారం కోఠి రాణి పార్కు, నల్లపోచమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నవగ్రహ హోమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్నార్తులకు, నిరుపేదలకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందించేందుకు భజరంగ్ సేన అందుబాటులో ఉంటుందన్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అలాంటిది పదిమందికి పంచి పెట్టడమే మహాదానమని అన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, ప్రభు, నందు, శ్రీనివాస్ సంఘం, కొండారెడ్డి, భక్తులు. తదితరులు పాల్గొన్నారు. అన్నదాతలకు భక్తులు దైవ ఆశీస్సులతో పాటు ఆశీర్వాదం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు.



## కొడిమ్యాల మండలంలో కాంగ్రెస్‌కు షాక్

**రాజీనామా చేసిన మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు**

జగిత్యాల, , ఏప్రిల్ 17 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని అక్షయ ఫంక్షన్ హాల్లో శుక్రవారం నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నేత పిడుగు ప్రభాకర్ రెడ్డి తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయనతో పాటు సుమారు 50 మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తాను అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నానని, భవిష్యత్తులో ఏ పార్టీలో చేరాలనే విషయంపై త్వరలోనే అనుచరులతో చర్చించి నిర్ణయం తీసుకుని వెల్లడిస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఎలక్షన్స్ లో తనకు సొంత పార్టీ వారే అన్యాయం చేశారని, అధిష్టానం కూడా తనకు సహకరించకుండా మాట తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము ప్రస్తుత ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గెలుపుకు శక్తివంచన లేకుండా కృషి చేశామని, అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకులకు పెద్దపీట వేయడం లేదన్నారు. కాగా శుక్రవారం కొడిమ్యాల మండలానికి చెందిన పలువురు మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు.

## ప్రాణరక్షణలో సీపీఆర్ కీలకం

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 17 (ఈవార్తలు): ప్రమాద సమయంలో సీపీఆర్, ప్రాథమిక చికిత్స అందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, ఇది ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. రోడ్డు ప్రమాద బాధితులను రక్షించిన వారికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "రహ్ వీర్" పథకం ద్వారా రూ.25 వేల నగదు ప్రోత్సాహకం అందిస్తామని తెలిపారు. జగిత్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో "అరైవ్.. అలైవ్" కార్యక్రమంలో భాగంగా ఫస్ట్ రెస్పాండర్లకు సిపిఆర్, ప్రాథమిక చికిత్సపై శిక్షణ నిర్వహించారు. ప్రధాన రహదారుల వద్ద ఉన్న దుకాణాలు, హోటళ్లు, పెట్రోల్ బంకుల నిర్వాహకులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన తొలి గంటను "గోల్డెన్ అవర్"గా పరిగణిస్తారని, ఈ సమయంలో సరైన వైద్యం అందిస్తే ప్రాణాలను రక్షించవచ్చని తెలిపారు. ప్రమాద బాధితులను వెంటనే ఆసుపత్రికి తరలించడం అత్యంత అవసరమని సూచించారు. గుడ్ సమారిటన్ చట్టం ప్రకారం సహాయం చేసిన వారికి ఎలాంటి చట్టపరమైన ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ప్రాణరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## కమటాల శ్రీనివాస్ తల్లికి అడ్లూరి నివాళి

జగిత్యాల, ఏప్రిల్ 17 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఆర్టీఏ సభ్యుడు కమటాల శ్రీనివాస్ తల్లి మృతి చెందడంతో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు నందయ్య పరామర్శించారు.వారి కుటుంబ సభ్యులను ఆదుర్దాగా పరామర్శిస్తూ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, పీసీసీ నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అంజన్నకు 17 రోజుల్లో 75 లక్షలు

మల్యాల, ఏప్రిల్ 17 (ఈవార్తలు): కొండగట్టు ఆంజనేయస్వామికి గత 17 రోజుల్లో రూ.75,02,126 ఆదాయం సమకూరింది. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన హుండీ లెక్కింపులో భక్తులు కానుకలు సమర్పించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఈవో ఎస్ అంజనారెడ్డి ,ఏఈవో హరిహార్నాథ్, స్థానాచారి కపిందర్ చారి, ప్రధాన అర్చకుడు రామకృష్ణ, పర్యవేక్షకులు సునీల్, ఏసీ కార్యాలయం ఇన్స్పెక్టర్ రాజమౌళి, ఏఎస్సై శ్రీనివాస్‌తో పాటుగా లలిత సేవా ట్రస్టు సేవ సమితి సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్య కార్మికుల సమ్మె బాట!

**సమస్యలు పట్టని సర్కారు.. మే 25న మహాధర్నాకు పిలుపు.. సమ్మెలో 17,000 మంది!.. సర్కారు తేరుకోకపోతే ఇబ్బందే**

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఈవార్తలు): తెలంగాణలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్వైజర్ విభాగాల్లో పనిచేస్తున్న బెడ్‌సైడ్ కాంట్రాక్ట్ కార్మికులు సమ్మె బాట పట్టేందుకు సిద్ధమయ్యారు. వేతనాలు పెంచకపోతే, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయకపోతే మే 25న రాష్ట్రవ్యాప్తంగా మహాధర్నాతో గళం ఎత్తనున్నట్లు సర్వీస్ ప్రొటెక్షన్ సొసైటీ (ఎస్పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య హెచ్చరిక చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలందిస్తున్న సుమారు 17,000 మంది శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్వైజర్ కార్మికులు ఏజెన్సీల ద్వారా కాంట్రాక్టర్ల కింద పనిచేస్తున్నారని, కాంట్రాక్టర్లు వారిని తీవ్రంగా శ్రమ దోపిడీ చేస్తున్నారని సైదయ్య ఆరోపించారు. 2022లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం ప్రతి కార్మికుడికి రూ.15,600 వేతనం నిర్ణయించినప్పటికీ, కాంట్రాక్టర్లు జిల్లాలు, ఏరియాల వారీగా రూ.10,000 నుంచి రూ.11,000 మాత్రమే ఇస్తున్నారని, మిగిలిన మొత్తాన్ని తమ జేబులో వేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్పీఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజాభవన్‌లో వినతిపత్రం సమర్పించారు. అలాగే డీఎంఈ ఆఫీసుకు లేఖ కూడా సమర్పించారు. 'కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. కార్మికులను ఐఎఫ్ఎంఐఎస్‌లో విలీనం చేయాలి. కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలి. ఎంప్లాయిస్ షేర్ పూర్తిగా ప్రభుత్వమే భరించాలి. ఈఎస్ఐ, హెల్త్ కార్డులు అందించాలి. జీతాలు ప్రతి నెల 5వ తేదీ లోపు చెల్లించాలి. మహిళా కార్మికులకు వేతనంతో కూడిన నెలసరి సెలవు, ప్రసూతి సెలవులు ఇవ్వాలి. డ్యూటీకి వచ్చేటప్పుడు లేదా తిరిగి వెళ్తున్నప్పుడు ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబానికి రూ.10 లక్షల ప్రమాద బీమా, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. బెడ్‌సైడ్ కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి, డీఎంఈ, టీవీవీపీ కింద ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాల'ని డిమాండ్ చేశారు. లేకపోతే మే 25న హైదరాబాద్‌లో 33 జిల్లాల నుంచి వేల మంది కార్మికులతో మహాధర్నా నిర్వహించవలసి వస్తుందని కుర్రి సైదయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎస్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు మాతంగి అనిల్ కుమార్, రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శి గొర్రె నాగరాజు, హైదరాబాద్ గాంధీ హాస్పిటల్ ఎస్పీఎస్ నాయకులు ఆనంద్, మురళి, రమణ అక్క, అనిల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# కేసీఆర్ సభను అడ్డుకునేందుకు కుట్ర

**వేముల ప్రశాంత్ రెడ్డి**

**రోడ్డు కట్‌పై తీవ్ర విమర్శలు..**

**డైవర్షన్ లేకపోతే కోర్టుకెళ్తామన్న హెచ్చరిక**



జగిత్యాల, ఏప్రిల్ 17 (ఈవార్తలు): ఈ నెల 20న జరగనున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగ సభను అడ్డుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. జగిత్యాల పట్టణ శివార్లలో నేషనల్ హైవే (ఎన్‌హెచ్-63)పై జరుగుతున్న పనులను బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావుతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. సభకు ఆర్మూర్, బాల్కొండ, కోరుట్ల, మెట్పల్లి ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలను అడ్డుకునేందుకే ఉద్దేశపూర్వకంగా ప్రధాన రహదారిని తవ్వుతున్నారని విమర్శించారు. బ్రిడ్జి పనులు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్నప్పటికీ, కేసీఆర్ సభకు ముందు రోజుల్లోనే రోడ్డు కట్ చేయడం వెనుక దురుద్దేశం ఉందని ప్రశ్నించారు. నేషనల్ హైవేపై పనులు చేపట్టే ముందు తప్పనిసరిగా డైవర్షన్ రోడ్ ఏర్పాటు చేయాలని నిబంధన ఉన్నప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలిగేలా పూర్తిగా రోడ్డును మూసివేయడం దుర్మార్గమని అన్నారు. జగిత్యాల ప్రజలు తమ దైనందిన అవసరాల కోసం కిలోమీటర్ల దూరం చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ, లేకపోతే ఆర్‌అండ్‌బీ శాఖ, సంబంధిత అధికారులపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా కేసీఆర్ సభను లక్షలాది మందితో విజయవంతం చేస్తామని వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## నేడు జగిత్యాలకు కేటీఆర్, హరీశ్

**కేసిఆర్ సభ ఏర్పాట్ల పరిశీలన**

జగిత్యాల, ఏప్రిల్ 17 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఈనెల 20న జరిగే కేసిఆర్ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్, మాజీ మంత్రి హరీషారావులు నేడు జగిత్యాలలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వారు మాజీ మంత్రి జీవన్ రెడ్డి, బిఆర్ఎస్ శ్రేణులతో కలసి కేసిఆర్ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేయనున్నారు. అయితే ఇప్పటికే జగిత్యాల పట్టణంలోని మినీ స్టేడియంలో కేసిఆర్ బహిరంగసభఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, వేముల ప్రశాంత్ రెడ్డి, సభ ఇన్చార్జిలు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్రావు, మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ లు సభ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

## ధర్మపురి ముస్లిం కమిటి అధ్యక్షుడిగా షబ్బీర్

ధర్మపురి, ఏప్రిల్ 17 (ఈవార్తలు): ధర్మపురి ముస్లిం కమిటీ అధ్యక్ష ఎన్నికలు శుక్రవారం పట్టణంలోని మసీదుల్లో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 358 ఓట్లు పోల్ కాగా మహమ్మద్ షబ్బీర్ కు 224 ఓట్లు, షేక్ జైనోద్దీన్కు 132 ఓట్లు రాగా, షబ్బీర్ 92 ఓట్ల మెజార్టీతో ఎన్నికల కమిటి సభ్యులు ప్రకటించారు. నూతనంగా ముస్లిం కమిటి అధ్యక్షుడిగా ఎన్నికైన మహమ్మద్ షబ్బీర్ను పట్టణ నాయకులు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.




## అందుబాటులోకి లక్ష్మీనరసింహస్వామి సదన్

**వెల్లడించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్**

ధర్మపురి, ఏప్రిల్ 17 (ఈవార్తలు): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం పని చేసే ప్రభుత్వం అని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాగితాలకే పరిమితమైందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న లక్ష్మీనరసింహస్వామి సదన్‌ను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5 కోట్ల అంచనాతో ప్రారంభించిన సదన్ నిర్మాణానికి గత ప్రభుత్వం కేవలం రూ.1 కోటి మాత్రమే విడుదల చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క సహకారంతో నిధులు విడుదల చేయించినట్లు తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత అదనంగా రూ.2.24 కోట్లు మంజూరు చేయించి సదన్‌ను పూర్తిచేసినట్లు వెల్లడించారు. కొత్తగా నిర్మించిన గదులకు ఫర్నిచర్ కోసం సుమారు రూ.1 కోటి ఖర్చు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు.పూర్తిస్థాయి వసతులతో లక్ష్మీనరసింహస్వామి సదన్ భక్తులకు అందుబాటులోకి రావడం ఆనందదాయకమని ఆయన తెలిపారు.

## బీజేపీ మాయోపాయం పారలేదు: షర్మిల



విజయవాడ, ఏప్రిల్ 17 (ఈవార్తలు): ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో బీజేపీ కుతంత్రాలకు పాల్పడిందని, అయితే వారి మాయోపాయం ఫలించలేదని ఆమె వ్యాఖ్యానించారు. ఇది ఎన్డీఏ అధర్మంపై ఇండియా కూటమి సాధించిన ధర్మయుద్ధ విజయమని, ప్రజాస్వామ్యం నిలబడిందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా షర్మిల స్పందిస్తూ... "విఫలమైంది అతి గతి లేని డీలిమిటేషన్ బిల్లే తప్ప, మహిళా రిజర్వేషన్ బిల్లు కాదు. మహిళా బిల్లుకు 2023లోనే ఆమోదం లభించింది. విపక్షాలు ఎన్నడూ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదు. రాజ్యాంగాన్ని మార్చే కుట్రను మాత్రమే ప్రతిపక్షాలు తిప్పికొట్టాయి" అని స్పష్టం చేశారు. మహిళల పేరుతో నీచ రాజకీయాలు చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి, బీజేపీకి ఇది చెంపపెట్టు లాంటిదని ఆమె ఘాటుగా విమర్శించారు. సాధికారత పేరుతో సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీయాలనే బీజేపీ కుయుక్తులు చెల్లలేదని అన్నారు. ఇది భారతదేశ ప్రజల విజయమని, బీజేపీ రాజకీయ దురుద్దేశానికి ఇది చరమ గీతమని అభివర్ణించారు. ప్రతిపక్షాలపై బురదజల్లడం మాని, మహిళలపై చిత్తశుద్ధి ఉంటే 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని షర్మిల డిమాండ్ చేశారు.

## తిరుపతి స్విమ్స్‌లో ఎన్నారై విద్యార్థులకు ఊరట

తిరుపతి, ఏప్రిల్ 17 (ఈవార్తలు): తిరుపతి స్విమ్స్ అనుబంధ శ్రీ పద్మావతీ మహిళా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్న ఎన్నారై విద్యార్థులకు టీటీడీ భారీ ఊరట కల్పించింది. ఇకపై ఐదేళ్లకు బదులుగా నాలుగున్నర సంవత్సరాలకే ట్యూషన్ ఫీజులు వసూలు చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో విద్యార్థులపై ఫీజుల భారం తగ్గనుంది. శ్రీ పద్మావతీ మహిళా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ కోర్సు కాలపరిమితి నాలుగున్నర సంవత్సరాలు కాగా, యాజమాన్యం ఐదేళ్ల పాటు ఫీజులు వసూలు చేస్తోంది. ఈ విషయంపై 2021-22 బ్యాచ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇటీవల టీటీడీ ఈవో ఎం. రవిచంద్రను కలిసి విజ్ఞప్తి చేశారు. కోర్సు వ్యవధికి అనుగుణంగానే ఫీజులు వసూలు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. విద్యార్థుల విజ్ఞప్తిపై స్పందించిన ఈవో, జాతీయ వైద్య కమిషన్ ఈ నెల 7న జారీ చేసిన నిబంధనలను పరిశీలించారు. అనంతరం, ఎన్నారై కోటా ఎంబీబీఎస్ విద్యార్థుల నుంచి నాలుగున్నర సంవత్సరాలకే ఫీజులు వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నిర్ణయాన్ని ఆమోదం (రాటిఫికేషన్) కోసం స్విమ్స్ ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశం ముందు ఉంచనున్నారు. ప్రస్తుతం 2021-22 బ్యాచ్ విద్యార్థులు చివరి సంవత్సరంలో ఉండటంతో ఈ నిర్ణయం వారికి తక్షణమే వర్తించనుంది.

## కేసిఆర్ బహిరంగసభను విజయవంతం చేయాలి.

**ధర్మపురి ఇన్చార్జి తక్కళ్లపల్లి రవీందర్ రావు**



ధర్మపురి, ఏప్రిల్ 17 (ఈవార్తలు): ఈనెల 20న జగిత్యాలలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ధర్మపురి నియోజకవర్గ ఇన్చార్జ్ తక్కల్లపల్లి రవీందర్రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కోరారు. గొల్లపల్లి మండలంలోని బిఆర్ఎస్ నాయకులకు సన్నాహక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఇబ్బంది పెట్టే అంశాలను వివరించారు. అడ్డగోలు హామీలతో పదవిలోకి వచ్చిన ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. జగిత్యాల టైగర్ తాటిపర్తి జీవన్ రెడ్డి బిఆర్ఎస్లో చేరడం శుభ పరిణామమని పేర్కొన్నారు. జగిత్యాల జనగర్జన సభకు ప్రజలు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వేలాది తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## లక్ష్మీపూర్ పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 17 (ఈవార్తలు): జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రారంభించారు. జిల్లా పరిషత్ పాఠశాలలో రాంకీ గ్రూప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సరస్వతి మాత విగ్రహం, బాస్కెట్‌బాల్ కోర్టును ప్రారంభించారు. పదవీ విరమణ పొందుతున్న ఇంచార్జి ప్రిన్సిపాల్ మద్దెల సరోజన గంగారం దంపతులను సన్మానించగా, విగ్రహ దాత ఎడమల తిరుపతి రెడ్డిని ఘనంగా అభినందించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మౌలిక సదుపాయాల కోసం నిధులు కేటాయిస్తామని, చల్గల్ వద్ద 25 ఎకరాల్లో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపడతామని తెలిపారు. ప్రభుత్వ విద్యను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## తేజస్వీసూర్యను భర్తరఫ్ చేయాలి: మోరపల్లి ప్రదీప్



జగిత్యాల, ఏప్రిల్ 17 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియపై అవమానకర వ్యాఖ్యలు చేసిన ఎంపీ తేజస్వి సూర్యను తక్షణమే పదవి నుంచి భర్తరఫ్ చేయాలని తెలంగాణవాది, జానపద కళాకారుడు మోరపల్లి ప్రదీప్ కుమార్ డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సమాజాన్ని అవమానించేలా ఒక ఎంపీ స్థాయి వ్యక్తి వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. వేలాది మంది త్యాగాలతో సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని భారత్-పాక్ విభజనతో పోల్చడం ఆయన అవివేకానికి నిదర్శనమని విమర్శించారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పని చేయాల్సిన ప్రజాప్రతినిధులు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. తేజస్వి సూర్య తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఉద్దేశపూర్వకంగా వ్యాఖ్యలు చేసి తరువాత వక్రీకరణ జరిగిందని చెప్పడం సమంజసం కాదన్నారు. అతనిని ఎంపీ పదవి నుంచి తొలగించడంతో పాటు, భవిష్యత్‌లో ఏ పదవికి పోటీ చేయకుండా అనర్హత విధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్రం, సమాజంపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సహించబోమని హెచ్చరించారు.

# మోదీ మాయగాడు

## లోక్‌సభలో రాహుల్ వ్యాఖ్యల దుమారం

### బీజేపీ తీవ్ర ఆగ్రహం.. క్షమాపణకు డిమాండ్

**లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు శుక్రవారం తీవ్ర గందరగోళానికి దారితీశాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు వివాదాస్పద బిల్లులపై జరిగిన చర్చలో, ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి పరోక్షంగా చేసిన 'మాయగాడు' వ్యాఖ్యలు పార్లమెంటులో పెను దుమారాన్ని రేపాయి.**



న్యూఢిల్లీ: రాహుల్ వ్యాఖ్యలు పార్లమెంటును, 140 కోట్ల మంది ప్రజలను అపహాస్యం చేయడమేనని ఆరోపిస్తూ, ఆయన క్షమాపణ చెప్పాలని బీజేపీ సభ్యులు పట్టుబట్టారు. దీంతో సభలో వాడివేడి వాగ్వాదాలు, నిరసనలు చోటుచేసుకున్నాయి. చర్చలో భాగంగా రాహుల్ గాంధీ తన బాల్యంలోని కొన్ని జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకప్పుడు తాను చూసిన ఒక గారడీ ప్రదర్శనను ప్రస్తావిస్తూ, అందులో ఒక ట్రిక్ విఫలమవడంతో ఆ మెజీషియన్ ప్రదర్శన ముగిసిపోయిందని అన్నారు. ఈ బిల్లులు నెగ్గవని బీజేపీకి తెలిసినా, దేశ ఎన్నికల స్వరూపాన్ని మార్చడం, తాను మహిళా పక్షపాతినని చాటుకోవడం అనే రెండు సందేశాలను ప్రధాని ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ క్రమంలో "బాలాకోట్ మాయగాడు, డీమానిటైజేషన్ మాయగాడు, సిందూర్ మాయగాడు అకస్మాత్తుగా పట్టుబడ్డాడు" అంటూ రాహుల్ పదునైన వ్యాఖ్యలు చేయడంతో బీజేపీ సభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఆపరేషన్ సిందూర్'ను గారడీగా అభివర్ణించి రాహుల్ గాంధీ సాయుధ బలగాలను, దేశాన్ని అవమానించారని, ఆయన వ్యాఖ్యలను సభా రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో స్పీకర్ ఓం బిర్లా జోక్యం చేసుకుని, ఆ వివాదాస్పద వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. పార్లమెంటరీ భాషను ఉపయోగించాలని రాహుల్‌కు సూచించారు. స్పీకర్ సూచనతో రాహుల్ తన 'మాయగాడు' వ్యాఖ్యలను పక్కనపెట్టినా, ప్రభుత్వంపై దాడిని మాత్రం ఆపలేదు. దేశాన్ని రక్షించే సాయుధ బలగాలు తామేనని బీజేపీ భావిస్తోందని, సాయుధ బలగాల వెనుక పిరికిపందల్లా దాక్కోవడం ఆపాలని ఆయన హితవు పలికారు. అంతకుముందు, తన నానమ్మ ఇందిరా గాంధీ, అటల్ బిహారీ వాజ్‌పేయి వంటి వారు డీలిమిటేషన్ వల్ల తలెత్తే ప్రమాదాలను గ్రహించి, దానిని ముందుకు తీసుకెళ్లలేదని రాహుల్ గుర్తుచేశారు.

## ఇండోనేషియాలో హెలికాప్టర్ కూలి 8 మంది మృతి

జకార్తా: ఇండోనేషియాలో ఘోర హెలికాప్టర్ ప్రమాదం చోటుచేసుకుంది. వెస్ట్ కాలిమంతన్ ప్రావిన్స్‌లో జరిగిన ఈ దుర్ఘటనలో హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది మృతి చెందారు. దట్టమైన అటవీ ప్రాంతంలోని కొండల మధ్య హెలికాప్టర్ శకలాలను అధికారులు గుర్తించారు. జిన్హువా వార్తా సంస్థ కథనం ప్రకారం మెలావీలోని ఒక ప్లాంటేషన్ ఏరియా నుంచి టేకాఫ్ అయిన కేవలం ఐదు నిమిషాలకే ఎయిర్‌బస్ హెచ్130 హెలికాప్టర్‌తో సంబంధాలు తెగిపోయాయి. అనంతరం గాలింపు చర్యలు చేపట్టగా, గురువారం మధ్యాహ్నం 3:25 గంటల సమయంలో ఇండోనేషియా వైమానిక దళానికి చెందిన సూపర్ ప్యూమా హెలికాప్టర్ మొదట శకలాలను గుర్తించింది. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో ఇద్దరు సిబ్బంది, ఆరుగురు ప్రయాణికులు ఉన్నారు. సహాయక బృందాలు ఇప్పటివరకు నాలుగు మృతదేహాలను వెలికితీశాయి. మరో మూడు మృతదేహాలు శకలాల్లోనే చిక్కుకోగా, మరొకరి కోసం గాలింపు కొనసాగుతోంది. చీకటి పడటం, భూభాగం అత్యంత కఠినంగా ఉండటంతో సహాయక చర్యలను తాత్కాలికంగా నిలిపివేశారు. శుక్రవారం ఉదయం తిరిగి ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. రాయిటర్స్ నివేదిక ప్రకారం ఈ హెలికాప్టర్ మాథ్యూ ఎయిర్ నుసంతారాకు చెందినది. చిత్ర మహకోట అనే పామాయిల్ కంపెనీకి చెందిన ప్లాంటేషన్ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది.

## పెద్దల సభలో 'హరివంశ్' హ్యాట్రిక్

### రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా మరోసారి ఏకగ్రీవం

న్యూఢిల్లీ: భారత పార్లమెంటు ఎగువ సభలో ఎన్డీయే తన పట్టును మరోసారి చాటుకుంది. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికై అరుదైన రికార్డు సృష్టించారు. ఎన్డీయే తరపున కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్ ఆయన పేరును ప్రతిపాదించగా, విపక్షాల నుంచి ఎవరూ పోటీకి రాకపోవడంతో హరివంశ్ ఎన్నిక లాంఛనమైంది. ఈ మేరకు రాజ్యసభ చైర్మన్ అధికారికంగా ప్రకటన చేయగానే సభలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ హరివంశ్ నారాయణ్ సింగ్‌ను అభినందిస్తూ ప్రశంసల జల్లు కురిపించారు. ఒక సాధారణ గ్రామం నుంచి ప్రయాణాన్ని మొదలుపెట్టి, జర్నలిజం రంగంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించి, నేడు పార్లమెంటరీ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న హరివంశ్ ప్రస్థానం స్ఫూర్తిదాయకమని ప్రధాని పేర్కొన్నారు. సభను నిష్పక్షపాతంగా, హుందాగా నడపడంలో ఆయనకు ఉన్న నేర్పు పెద్దల సభకు ఒక అలంకారమని కొనియాడారు. కేవలం అధికార పక్షమే కాకుండా, విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే సహా ఇతర సభ్యులు కూడా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సభా మర్యాదలను కాపాడుతూ, అందరినీ కలుపుకుని పోతారనే నమ్మకాన్ని వారు వ్యక్తం చేశారు. మొత్తానికి ఈ ఏకగ్రీవ ఎన్నికతో రాజ్యసభలో ఎన్డీయే వ్యూహం ఫలించినట్లయింది.

## శాంతి చర్చల కోసం పాక్ వెళ్తా: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరు దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిరితే, దానిపై సంతకం చేసేందుకు తాను పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌కు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఈ చర్చల కోసం వారు నన్ను ఆహ్వానిస్తున్నారు, ఒకవేళ ఇస్లామాబాద్‌లో ఒప్పందం ఖరారైతే నేను తప్పకుండా అక్కడికి వెళ్తాను' అని ట్రంప్ స్పష్టం చేశారు. ఈ శాంతి చర్చల్లో మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్ నాయకత్వాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రశంసించారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ అద్భుతంగా పనిచేస్తున్నారని కొనియాడారు. గత రెండు నెలలతో పోలిస్తే ప్రస్తుతం ఇరాన్ చర్చలకు సానుకూలంగా స్పందిస్తోందని ట్రంప్ తెలిపారు. ఇరాన్ అణ్వాయుధాలను కలిగి ఉండకూడదనేదే తమ ప్రధాన షరతని, ఈ విషయంలో మంచి ఒప్పందం కుదురుతుందని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. భూగర్భంలో దాచిన యురేనియం నిల్వలను (న్యూక్లియర్ డస్ట్) వెనక్కి ఇచ్చేందుకు ఇరాన్ అంగీకరించిందని, త్వరలోనే తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు.

## అణు నిల్వల అప్పగింతకు ఇరాన్ ఓకే

### డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన

వాషింగ్టన్: అమెరికా, ఇరాన్ మధ్య గత ఆరు వారాలుగా నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలకు త్వరలో తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. అణు కార్యక్రమానికి కీలకమైన శుద్ధి చేసిన యురేనియం నిల్వలను అప్పగించేందుకు ఇరాన్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదరడానికి చాలా మంచి అవకాశాలు ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు. వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ కొనసాగుతున్న చర్చల్లో ఇదొక కీలక ముందడుగు అని ట్రంప్ అభివర్ణించారు. "వారు శుద్ధి చేసిన యురేనియంను మాకు తిరిగి ఇవ్వడానికి అంగీకరించారు" అని ఆయన తెలిపారు. ఈ వారాంతంలోనే తదుపరి చర్చలు జరగవచ్చని, ప్రస్తుత కాల్పుల విరమణను పొడిగించాల్సిన అవసరం కూడా రాకపోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. "నాలుగు వారాల బాంబు దాడులు, శక్తిమంతమైన దిగ్బంధనం వల్లే ఇరాన్ ఇప్పుడు మెత్తబడింది" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. గత చర్చల్లో ఇరాన్ అణు కార్యక్రమాలపై ప్రతిష్టంభన ఏర్పడింది. ఇరాన్ తన అణు కార్యకలాపాలను 20 ఏళ్ల పాటు నిలిపివేయాలని అమెరికా ప్రతిపాదించగా, ఇరాన్ మాత్రం 3 నుంచి 5 ఏళ్ల విరామానికి మొగ్గు చూపినట్లు తెలిసింది. అయితే తాజాగా, తమ యురేనియం నిల్వల్లో కొంత భాగాన్ని దేశం వెలుపలకి పంపేందుకు టెహ్రాన్ అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ చర్చల్లో మధ్యవర్తిత్వం వహించిన పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్‌లను ట్రంప్ ప్రశంసించారు. ఒప్పందం ఇస్లామాబాద్‌లో జరిగితే తాను కూడా హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇదే సమయంలో ఇరాన్ విషయంలో పోప్ లియో ౹౪ వైఖరిపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

# మార్కెట్ల జోరు

### లాభాల్లో ముగిసిన సూచీలు



ముంబై: వారాంతంలో అమెరికా, ఇరాన్ మధ్య జరగనున్న చర్చలపై ఇన్వెస్టర్లు ఆశావహ దృక్పథంతో ఉండటంతో భారత ఈక్విటీ మార్కెట్లు శుక్రవారం లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయన్న అంచనాలతో కొనుగోళ్ల వైపు మొగ్గు చూపారు. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 504.86 పాయింట్లు లాభపడి 78,493.54 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 156.80 పాయింట్లు పెరిగి 24,353.55 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో హిందుస్థాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ వంటి షేర్లు రాణించి మార్కెట్లకు మద్దతునిచ్చాయి. రంగాల వారీగా చూస్తే ఎఫ్ఎంసీజీ, ఆయిల్ అండ్ గ్యాస్, మీడియా సూచీలు మంచి లాభాలు సాధించగా, ఐటీ రంగం షేర్లు మాత్రం నష్టాలతో ముగిశాయి. ప్రధాన సూచీలతో పోలిస్తే మిడ్‌క్యాప్ 1.27 శాతం, స్మాల్‌క్యాప్ 1.48 శాతం మేర లాభపడి మెరుగైన పనితీరు కనబరిచాయి. ఇరాన్‌తో వివాదాన్ని త్వరలోనే ముగించాలని భావిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం, లెబనాన్-ఇజ్రాయెల్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదరడం వంటి పరిణామాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ఆపితేనే చర్చలకు వస్తామన్న ఇరాన్ షరతుకు ఇది అనుకూలంగా మారింది. "ఇటీవలి ఒడిదొడుకుల తర్వాత మార్కెట్ ఇప్పుడు స్థిరత్వ దశలోకి వస్తున్నట్లు కనిపిస్తోంది. నిఫ్టీకి తక్షణ అవరోధంగా 24,410 స్థాయి ఉంది. దీనిని దాటితే 24,700 వరకు వెళ్లే అవకాశం ఉంది. మార్కెట్ దిగివచ్చిన ప్రతిసారీ కొనుగోలు చేయడం మంచి వ్యూహం. 24,000 స్థాయి వద్ద నిఫ్టీకి బలమైన మద్దతు ఉంది," అని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. వారాంతంలో జరగబోయే అమెరికా-ఇరాన్ చర్చల ఫలితాలు మార్కెట్ తదుపరి గమనాన్ని నిర్దేశిస్తాయని వారు అంచనా వేస్తున్నారు.

## డాలర్‌పై రూపాయి పట్టు

ముంబై:అంతర్జాతీయ మార్కెట్లలో డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ ఇవాళ్టి ట్రేడింగ్‌లో బలపడింది. ప్రభుత్వ రంగ చమురు శుద్ధి సంస్థలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇచ్చిన ఓ కీలక ఆదేశం ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. డాలర్లను నేరుగా కొనుగోలు చేయడానికి బదులుగా ప్రత్యేక క్రెడిట్ లైన్‌ను ఉపయోగించుకోవాలని ఆర్బీఐ సూచించడంతో డాలర్లకు డిమాండ్ తగ్గి రూపాయిపై ఒత్తిడి తగ్గింది. గత సెషన్‌లో 93.20 వద్ద ముగిసిన రూపాయి, ఈరోజు ఉదయం ట్రేడింగ్‌లో 25 పైసలు లాభపడి 92.95 వద్ద కొనసాగుతోంది. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో సానుకూల సెంటిమెంట్, ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య కాల్పుల విరమణ వార్తలు, అమెరికా-ఇరాన్ చర్చలలో పురోగతి అంచనాలు కూడా రూపాయికి మద్దతునిచ్చాయి. అయితే, ప్రపంచ మార్కెట్లలో డాలర్ బలంగా ఉండటం రూపాయి లాభాలను కొంతమేర పరిమితం చేస్తోంది. మరోవైపు అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 1% పైగా తగ్గి 97.99 డాలర్ల వద్ద, యూఎస్ డబ్ల్యూటీఐ క్రూడ్ దాదాపు 2% తగ్గి 92.91 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి. ఇక బంగారం, వెండి ధరలు ఇవాళ ఒడుదొడుకులకు లోనయ్యాయి. జూన్ 5 గోల్డ్ ఫ్యూచర్స్ స్వల్పంగా రూ.98 పెరిగి రూ.1,53,250 వద్ద ట్రేడవ్వగా, మే 5 సిల్వర్ ఫ్యూచర్స్ 0.83% లాభపడి రూ.2,50,716 గరిష్ఠాన్ని తాకింది.

# దుబాయ్‌లో ఎయిర్ ట్యాక్సీలు

### తొలి స్టేషన్ నిర్మాణం




దుబాయ్: ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టి, ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించే దిశగా దుబాయ్ ప్రభుత్వం తన ప్రతిష్ఠాత్మక 'ఎయిర్ ట్యాక్సీ' ప్రాజెక్టును వేగవంతం చేసింది. ఇందులో భాగంగా దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో మొట్టమొదటి ఎయిర్ ట్యాక్సీ స్టేషన్ (వర్టిపోర్ట్) నిర్మాణం పూర్తిచేసింది. ఈ విషయాన్ని దుబాయ్ యువరాజు హమ్దాన్ బిన్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ ప్రకటించారు. 3,100 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఎయిర్ ట్యాక్సీ స్టేషన్ లో ఏటా 1,70,000 మంది ప్రయాణించడానికి వీలుగా సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ స్టేషన్ ఈ ఏడాది చివరికి ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం దుబాయ్ విమానాశ్రయం నుంచి పామ్ జుమేరాకు రోడ్డు మార్గంలో వెళ్లాలంటే రద్దీని బట్టి సుమారు 45 నిమిషాల నుంచి గంట సమయం పడుతుంది. అయితే, ఈ ఎయిర్ ట్యాక్సీల ద్వారా కేవలం 10 నుంచి 12 నిమిషాల్లోనే గమ్యాన్ని చేరుకోవచ్చు. 2026 చివరి నాటికి ఈ సేవలను పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని దుబాయ్ రోడ్స్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ లక్ష్యంగా నిర్దేశించుకుంది. మొదటి దశలో దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం, డౌన్‌టౌన్ దుబాయ్, దుబాయ్ మెరీనా, పామ్ జుమేరా వంటి నాలుగు కీలక ప్రాంతాల్లో ఈ వర్టిపోర్టులను నిర్మించనున్నారు. ఈ ఎయిర్ ట్యాక్సీలు పూర్తిగా విద్యుత్‌తో నడిచే వాహనాలు. హెలికాప్టర్ల తరహాలో నిలువుగా గాల్లోకి లేచి, నిలువుగా ల్యాండ్ అవుతాయి. వీటికి రన్‌వే అవసరం లేకపోవడంతో పాటు, తక్కువ శబ్దం చేస్తూ పర్యావరణహితంగా పనిచేస్తాయి. ఈ ఫ్లయింగ్ ట్యాక్సీల రాకతో పర్యాటకులు, వ్యాపారవేత్తలు విమానాశ్రయం నుంచి నేరుగా తమ గమ్యస్థానాలకు ట్రాఫిక్ చిక్కులు లేకుండా వేగంగా ప్రయాణించేందుకు వీలు కలుగుతుందని అధికారులు తెలిపారు.

## ఆసియా కుబేరుడిగా అదానీ

న్యూఢిల్లీ: ప్రముఖ పారిశ్రామికవేత్త, అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ మరోసారి ఆసియాలోనే అత్యంత సంపన్న వ్యక్తిగా అవతరించారు. ఈ క్రమంలో ఆయన రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముఖేశ్ అంబానీని అధిగమించారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ విడుదల చేసిన తాజా జాబితాలో ఈ మార్పు చోటుచేసుకుంది. తాజా గణాంకాల ప్రకారం గౌతమ్ అదానీ నికర సంపద 92.6 బిలియన్ డాలర్లకు చేరగా, ఆయన ప్రపంచ కుబేరుల జాబితాలో 19వ స్థానంలో నిలిచారు. మరోవైపు 90.8 బిలియన్ డాలర్ల సంపదతో ముఖేశ్ అంబానీ 20వ స్థానానికి పరిమితమయ్యారు. గురువారం స్టాక్ మార్కెట్లలో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు భారీగా లాభపడటంతో అదానీ సంపద ఒక్కరోజే సుమారు 3.56 బిలియన్ డాలర్లు పెరిగింది. శుక్రవారం కూడా అదానీ టోటల్ గ్యాస్, అదానీ పోర్ట్స్, అదానీ పవర్ వంటి షేర్లు 3 శాతం వరకు లాభాలతో ట్రేడ్ అయ్యాయి. 2026లో ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న అస్థిరతల నేపథ్యంలో సంపన్నుల ర్యాంకింగ్‌లు వేగంగా మారుతుండటం గమనార్హం. ప్రపంచ కుబేరుల జాబితాలో టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ 656 బిలియన్ డాలర్ల సంపదతో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ఆయన తర్వాత గూగుల్ సహ వ్యవస్థాపకుడు లారీ పేజ్ (286 బిలియన్ డాలర్లు) ఉన్నారు. ఇక ఇతర భారతీయ బిలియనీర్లలో లక్ష్మీ మిట్టల్ 62వ స్థానంలో, శివ్ నాడార్ 70వ స్థానంలో, షాపూర్ మిస్త్రీ 71వ స్థానంలో, సావిత్రి జిందాల్ 73వ స్థానంలో నిలిచారు.

# 30 ఏళ్లుగా మహిళలకు ఓటమే!

### 1996 నుంచి 2026 దాకా..

### మహిళా రిజర్వేషన్ బిల్లుపై వివాదం



న్యూఢిల్లీ: లోక్‌సభలో మహిళా బిల్లు వీగిపోవడం కొత్తేం కాదు. గత 30 ఏళ్లుగా మహిళా బిల్లుకు ఓటమే దిక్కవుతోంది. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్రం ప్రతిపాదించడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా దీన్ని అమలు చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. కానీ పలు కారణాల వల్ల ఇది అమలు కాలేకపోయింది. మొదటిసారిగా దేవెగౌడ ప్రభుత్వం 1996లో 81వ రాజ్యాంగ సవరణ బిల్లు రూపంలో దీన్ని ప్రవేశపెట్టింది. కానీ ఆ సమయంలో లోక్‌సభ రద్దు కావడంతో ఆ బిల్లు నిలిచిపోయింది. ఆ తర్వాత అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో కూడా పలుమార్లు ఈ బిల్లును ప్రవేశపెట్టారు. 1998, 1999, 2002 , 2003.. ఏకంగా నాలుగుసార్లు ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. కానీ ఆ సమయంలో బిల్లు ప్రతిప్రతులను చింపివేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. చివరికి మిత్రపక్షాల సపోర్ట్ లభించక ఈ ప్రయత్నాలు విఫలమయ్యాయి. యూపీఏ హయాంలో 2010లో రాజ్యసభ ఈ మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించింది. కానీ లోక్‌సభలో మాత్రం అడుగు ముందుకు పడలేదు. సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ లాంటి పలు విపక్ష పార్టీలు ఈ రిజర్వేషన్‌లో ఓబీసీ మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ ఉండాలని పట్టుబట్టాయి. దీంతో రాజకీయ ఏకాభిప్రాయం కుదరక లోక్‌సభలో ఓటింగ్ జరగలేదు. ఆ తర్వాత 2014లో లోక్‌సభ రద్దు కావడంతో ఆ బిల్లు ఆగిపోయింది. ఇలా దశాబ్దాల పాటు కేవలం పార్టీల మేనిఫెస్టోలకే ఈ మహిళా రిజర్వేషన్ బిల్లు పరిమితమైంది.

## ద్వంద్వ పౌరసత్వం.. రాహుల్ గాంధీపై కేసు

### విచారణకు అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు

ప్రయాగ్‌రాజ్: లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి ద్వంద్వ పౌరసత్వం ఉందన్న ఆరోపణలపై కేసు నమోదు చేసి, విచారణ జరపాలని అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ ఉత్తర్వులిచ్చింది. ఈ కేసు దర్యాప్తును ఉత్తరప్రదేశ్ ప్రభుత్వమే స్వయంగా నిర్వహించాలని సూచించింది. లేదంటే ఒక కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని పేర్కొంది. రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న తన అభ్యర్థనను లక్నోలోని ప్రత్యేక ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు ఈ సంవత్సరం జనవరి 28న తిరస్కరించడంతో, బీజేపీ కార్యకర్త విఘ్నేష్ శిశిర్ అప్పీలు చేశారు. దీంతో అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ ఈ ఉత్తర్వులు ఇచ్చింది. రాహుల్ గాంధీ పౌరసత్వం అంశంపై కొన్నేళ్లుగా వివాదం కొనసాగుతోంది. రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని, భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలని బీజేపీ నేత సుబ్రహ్మణ్యస్వామి, కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త విఘ్నేష్ శిశిర్ డిమాండ్ చేస్తున్నారు. బ్రిటన్‌లో నమోదైన ఓ కంపెనీకి రాహుల్ గాంధీ డైరెక్టర్‌గా, సెక్రటరీగా ఉన్నారని సుబ్రహ్మణ్యస్వామి చెబుతున్నారు. ఆ కంపెనీ వార్షిక నివేదికలోనూ తనను తాను బ్రిటిష్ పౌరుడిగా రాహుల్ గాంధీ పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. వేరే దేశంలో పౌరుడిగా ఉన్న వ్యక్తి ఆ దేశ పౌరసత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవాల్సి ఉంటుందని అన్నారు. లేదంటే చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని అన్నారు. ఈ అంశంపై సుబ్రహ్మణ్యస్వామి గతంలో కేంద్ర ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు.

# ఇజ్రాయెల్‌కు హెజ్బొల్లా వార్నింగ్



టెహ్రాన్: కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తే తిరిగి దాడులు చేస్తామని లెబనాన్‌కు చెందిన హెజ్బొల్లా తీవ్రవాద సంస్థ హెచ్చరించారు. ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య పది రోజుల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హెజ్బొల్లా హెచ్చరికలు జారీ చేసింది. ఇజ్రాయెల్ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే, తమ వేళ్లు ఇంకా ట్రిగ్గర్ మీదే ఉన్నాయని తెలిపింది. ఇరాన్, అమెరికా మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. తాజాగా, ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య కూడా ఒప్పందం కుదిరింది. 10 రోజులపాటు కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఇప్పటికే ఈ ఒప్పందం అమల్లోకి వచ్చింది. ఈ విషయాన్ని కూడా అమెరికా ప్రకటించింది. ఇజ్రాయెల్, లెబనాన్ దేశాల నేతల మధ్య దశాబ్దాల తర్వాత తొలి సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. హెజ్బొల్లా కూడా కాల్పుల విరమణ పాటిస్తూ, ఈ 10 రోజులు ప్రశాంతంగా ఉంటుందని భావిస్తున్నట్లు చెప్పాడు. దీనివల్ల ఎలాంటి హింసాత్మక ఘటనలు ఉండవని, శాంతి ఏర్పడుతుందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో లెబనాన్‌లోని ప్రజలు తమ సొంత ప్రాంతాలకు తిరిగి వెళుతున్నారు. యుద్ధం కారణంగా ఇంతకాలం సరిహద్దు ప్రాంతాల ప్రజలు తమ ప్రాంతాలను ఖాళీ చేసి వెళ్ళిపోయారు. మరోవైపు, ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందాన్ని చైనా స్వాగతించింది.

## లవ్లీ చిత్రం



## పూరీ-విజయ్ సినిమాకేమైంది?

పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వెర్సటైల్ నటుడు విజయ్ సేతుపతి హీరోగా రూపొందుతున్న స్లమ్ డాగ్: 33 టెంపుల్ రోడ్ సినిమా విడుదలపై ఇంకా ఎలాంటి క్లారిటీ లేదు. షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసి ఫస్ట్ కాపీ సిద్ధంగా ఉన్నప్పటికీ.. రిలీజ్ డేట్ ప్రకటించడంలో జాప్యం చోటుచేసుకోవడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఆ ఆలస్యానికి ప్రధాన కారణంగా స్లమ్ డాగ్ మూవీ ఓటీటీ డీల్ ఇంకా ఫైనల్ కాకపోవడమేనని కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. థియేటర్లలో విడుదలకు ముందు ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ తో డిజిటల్ హక్కుల ఒప్పందాన్ని పూర్తి చేయాలని నిర్మాతలు భావిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం ఆ చర్చలు కొనసాగుతున్నాయని, డీల్ ఖరారైన వెంటనే రిలీజ్ డేట్ ప్రకటించే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. అదే సమయంలో దర్శకుడు పూరీ జగన్నాథ్ కు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలు కూడా సినిమా విడుదలపై ప్రభావం చూపుతున్నాయని వినికిడి. ఆయన గత చిత్రాలు లైగర్, డబుల్ ఇస్మార్ట్ తర్వాత కొన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కొత్త సినిమా విడుదలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా ముందుకు తీసుకెళ్లాలని ఆయన ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. నైజాం ప్రాంతానికి చెందిన కొంతమంది ఎగ్జిబిటర్లు పూరీ జగన్నాథ్ పై కేసులు దాఖలు చేసినట్లు తెలుస్తోంది. ఆ వివాదాల పరిష్కారం కోసం ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని, అవి క్లియర్ అయిన తర్వాత సినిమా విడుదలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. అన్ని సమస్యలు పరిష్కారమైతే, నిర్మాతలు త్వరలోనే విడుదల తేదీ ప్రకటించే అవకాశం ఉంది.






## అప్రూవర్‌గా మారుతా

బాలీవుడ్ లో సంచలనం రేపిన రూ.200 కోట్ల మనీలాండరింగ్ కేసులో కొత్త ట్విస్ట్ చోటు చేసుకుంది. ఆ కేసులో నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. తాను అప్రూవర్ గా మారేందుకు సిద్ధమని చెబుతూ ఢిల్లీ కోర్టును తాజాగా ఆశ్రయించారు. దీంతో ఆ పరిణామం కేసు విచారణలో మరింత కీలక మలుపుగా మారనుండగా.. ప్రస్తుతం ఆ విషయం చర్చనీయాంశంగా మారింది. ఆ కేసుకు సంబంధించిన ప్రధాన నిందితుడు సుకేశ్ చంద్రశేఖర్ ప్రస్తుతం జైలులో ఉన్నారు. ఆయనపై భారీ స్థాయిలో మోసాలు, మనీలాండరింగ్ ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తనపై ఉన్న ఆరోపణల నుంచి బయటపడేందుకు.. దర్యాప్తునకు సహకరించేందుకు జాక్వెలిన్ అప్రూవర్ గా మారాలని నిర్ణయించుకోవడం గమనార్హం. అయితే జాక్వెలిన్ దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ చేపట్టిన ఢిల్లీ కోర్టు, నిబంధనల ప్రకారం ముందుగా ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్‌ను సంప్రదించాలని సూచించింది. ఆమె తన అభ్యర్థనను అధికారికంగా ఈడీ ముందు ఉంచాలి. అనంతరం ఈడీ అధికారులు ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేస్తారు. ఆ వాంగ్మూలాన్ని పరిశీలించిన తర్వాత, ఆమెను అప్రూవర్ గా మార్చాలా వద్దా అన్న దానిపై నిర్ణయం తీసుకుని కోర్టులో నివేదిక సమర్పిస్తారు.

## బుల్లి రాజుకు బెస్ట్ కమెడియన్ అవార్డు



గత ఏడాది థియేటర్లలో నవ్వుల పూలు పూయించిన పేరు ‘బుల్లి రాజు’. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేష్ హీరోగా వచ్చిన ‘సంక్రాంతికి వస్తున్నాం’ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లు కొల్లగొట్టడమే కాకుండా, బుల్లి రాజు పాత్రతో రేవంత్‌ను స్టార్‌ను చేసింది. తాజాగా ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ (ఐఎన్సీఏ- 2026) ప్రకటించిన అవార్డుల్లో రేవంత్ ‘బెస్ట్ కామెడీ యాక్టర్’ అవార్డును గెలుచుకోవడం తెలుగు సినీ అభిమానులకు గర్వకారణంగా మారింది. విక్టరీ వెంకటేష్ మార్క్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా వచ్చిన ఈ సినిమా గతేడాది సంక్రాంతికి పెద్ద విజయం సాధించింది. ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి నటన ఒక ఎత్తయితే, బుల్లి రాజుగా రేవంత్ చేసిన కామెడీ మరో ఎత్తు. ఈ సినిమా తాజాగా ప్రతిష్టాత్మకమైన ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ అవార్డులకు ఎంపికై అరుదైన ఘనత సాధించింది. కేవలం కమర్షియల్ హిట్ మాత్రమే కాకుండా, నటనకు గుర్తింపుగా బెస్ట్ డైరెక్టర్ (అనిల్ రావిపూడి), బెస్ట్ కామెడీ యాక్టర్ విభాగాల్లో అవార్డులు అందుకోవడం విశేషం.

## నన్ను దారుణంగా దూషించారు




బాలీవుడ్ నటి కంగనా రనౌత్ కెరీర్‌లో ఎదుర్కొన్న అత్యంత కష్టతరమైన దశలను మరోసారి గుర్తు చేసుకున్నారు. సినీ పరిశ్రమలో మహిళగా నిలదొక్కుకోవడం ఎంత సవాలుతో కూడుకున్నదో చెప్పే ప్రయత్నం చేసారు. గతంలో తనపై వచ్చిన కొన్ని వింత ఆరోపణలు, వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంపై చూపిన ప్రభావం గురించి ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నేళ్ల క్రితం తన వ్యక్తిగత సంబంధాల నేపథ్యంలో ఎదురైన చేతబడి ఆరోపణల గురించి కంగనా ప్రస్తావించారు. కేవలం పుకార్ల ఆధారంగా ఒక వ్యక్తిని సమాజం ఏ విధంగా వేధిస్తుందో? వివరించడానికి విచ్ హంట్ అనే పదాన్ని ఉపయోగించారన్నారు. ఆధునిక కాలంలో కూడా ఇలాంటి మూఢనమ్మకాలతో కూడిన ఆరోపణలు చేయడం విచారకరమన్నారు. ఈ ఆరోపణలు వచ్చిన సమయంలో మీడియాలో - సోషల్ మీడియాలో తనను ఒక ప్రతికూల శక్తిగా చిత్రించారని కంగనా పేర్కొన్నారు. స్వయంకృషితో ఎదిగిన నటిని మానసికంగా కృంగదీయడానికి ఇలాంటి అవాస్తవ ప్రచారాలను ఆయుధాలుగా వాడుకున్నారని విమర్శించారు. దీంతో తన వ్యక్తిత్వానికి, ప్రతిష్ఠకు జరిగిన నష్టం అంతా ఇంతా కాదని వాపోయారు.

## ఇప్పుడే స్వేచ్ఛగా బతుకుతున్నా



టాలీవుడ్, కోలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లోనూ నటించి మెప్పించిన ముద్దుగుమ్మ హన్సిక మోత్వాని. ఈ మధ్య కాలంలో టాలీవుడ్ ప్రేక్షకులకు కాస్త దూరంగా ఉంటున్నప్పటికీ డబ్బింగ్ సినిమాలతో పలకరిస్తూనే ఉంది. ఈమె గురించిన వార్తలు ఎప్పుడూ మీడియాలో వస్తూనే ఉన్నాయి. ఆ మధ్య సోహైల్‌తో వివాహం సందర్భంగా పతాక స్థాయిలో ఈమె గురించిన వార్తలు వచ్చాయి. ప్రేమించి పెళ్లి చేసుకున్న హన్సిక గురించి జాతీయ మీడియాలో పెద్ద ఎత్తున వార్త కథనాలు ప్రచురించిన విషయం తెల్సిందే. పెళ్లి అయిన కొన్నాళ్లకే వీరిద్దరి మధ్య విభేదాలు మొదలయ్యాయి. దాంతో ఇద్దరూ విడివిడిగా ఉంటూ వస్తున్నారు. ఇప్పటి వరకు హన్సిక, సోహైల్ విడాకులు తీసుకున్నట్లుగా అధికారికంగా ఎక్కడా రాలేదు. కానీ తాను సింగిల్ అంటూ హన్సిక అధికారికంగా ప్రకటించింది. ఇటీవల అభిమానులతో చిట్‌చాట్ సందర్భంగా హన్సిక తాను ఒంటరి జీవితంను గడుపుతున్నట్లు చెప్పింది. అంతే కాకుండా ఒంటరితనం సంతోషాన్ని ఇస్తోందని కూడా చెప్పింది. ఇప్పుడు తాను చాలా స్వేచ్ఛగా ఉన్నట్లుగా కూడా హన్సిక పేర్కొంది. దాంతో విడాకుల తర్వాత హన్సిక స్వేచ్ఛ జీవితాన్ని అనుభవిస్తున్నట్లుగా చెప్పుకొచ్చింది అంటూ సోషల్ మీడియాలో పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



## బన్నీకి ఢిల్లీ హైకోర్టులో ఊరట

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ వ్యక్తిగత హక్కుల పరిరక్షణ విషయంలో వార్తల్లో నిలిచారు. తన అనుమతి లేకుండా పేరు, ఫోటోలు, వీడియోలు, వాయిస్ ను కమర్షియల్ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారని ఆరోపిస్తూ ఆయన ఢిల్లీ హైకోర్టును తాజాగా ఆశ్రయించారు. పర్సనాలిటీ రైట్స్ రక్షణ కోసం దాఖలు చేసిన ఆ సివిల్ సూట్ పిటిషన్ ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అల్లు అర్జున్ తరఫున న్యాయవాది స్వాతి సుకుమార్ కోర్టు దృష్టికి తీసుకెళ్లిన వివరాల ప్రకారం, కొన్ని సంస్థలతోపాటు కొందరు వ్యక్తులు ఆయనకు సంబంధం లేకుండా ఆయన ఇమేజ్ ను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా ఆయన వాయిస్ ను క్లోన్ చేసి, ఆయనలా మాట్లాడే యాప్ లను సృష్టించడం వంటి చర్యలు జరుగుతున్నాయని తెలిపారు. దీంతో ప్రజలు తప్పుదోవ పట్టే అవకాశం ఉందని, ఆయన బ్రాండ్ వాల్యూకు నష్టం కలిగే ప్రమాదం ఉందని వాదించారు. ఆ అంశంపై విచారణ చేపట్టిన జస్టిస్ తుషార్ రావు, నటుడి వాదనను పరిగణనలోకి తీసుకుని తగిన ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. అల్లు అర్జున్ కు అనుకూలంగా ఆర్డర్ ఇస్తామని చెప్పారు. అనుమతి లేకుండా సెలబ్రిటీల వ్యక్తిత్వాన్ని వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగించడం తప్పని కోర్టు ప్రాథమికంగా అభిప్రాయపడింది. అయితే తదుపరి విచారణలో దీనిపై స్పష్టమైన ఆదేశాలు వెలువడే అవకాశముంది.





# మారని కోల్‌కథ

## కేకేఆర్‌కు ఐదో ఓటమి.. గ్రీన్ మెరిసినా తప్పని గుజరాత్ థ్రిల్లింగ్ విక్టరీ

**పంతొమ్మిదో సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ ఆడిన ప్రతి మ్యాచ్ ఓడిపోతూనే ఉంది. ఇప్పటికే నాలుగింటా కంగుతిన్న కోల్‌కతాను ఉత్కంఠ పోరులో గుజరాత్ టైటాన్స్ మట్టికరిపించింది. కామెరూన్ గ్రీన్(79) మెరుపులతో గుజరాత్‌కు సవాల్ విసిరిన కోల్‌కతాను బౌలర్లు గట్టెక్కించలేదు.**

ఛేదనలో శుభ్‌మన్ గిల్ (86) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో విరుచుకుపడగా.. రాణించారు. 5 వికెట్ల తేడాతో గుజరాత్ ఘన విజయం సాధించగా.. అజింక్యా రహానే సేన ఐదోసారి నిరాశతో మైదానం వీడింది. మూడుసార్లు ఛాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్‌కు ఈసారి ఎందుకనో అదృష్టం కలిసి రావడం లేదు. టోర్నీ ఆరంభం నుంచి బోణీ కోసం నిరీక్షిస్తున్న ఆ జట్టును గుజరాత్ టైటాన్స్ చిత్తుగా ఓడించింది.



ఆఖరి ఓవర్ వరకూ పోరాడినా గెలుపు తలుపు మాత్రం తట్టలేకపోయింది కేకేఆర్. సొంత మైదానంలో పేసర్లు కగిసో రబడ(3-23), సిరాజ్(2-232)ల విజృంభణతో కోల్‌కతాను 180కే కట్టడి చేసిన గుజరాత్.. ఛేదనలో చెలరేగింది. ఓపెనర్ సాయి సుదర్శన్(22) విఫలమైనా.. శుభ్‌మన్ గిల్(86) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. జోస్ బట్లర్(25)ను వరుణ్ చక్రవర్తి ఔట్ చేసినా గిల్ అర్ధ శతకంతో కోల్‌కతా ఆశలపై నీళ్లు చల్లాడు. వాషింగ్టన్ సుందర్(13), గ్లెన్ ఫిలిప్స్(19)తో కలిసి జట్టు విజయానికి పునాది వేశాడు. వైభవ్ అరోరా ఓవర్లో గ్రీన్ డైవింగ్ క్యాచ్‌తో గిల్‌ను వెనక్కి పంపాడు. అప్పటికీ గుజరాత్‌కు 23 రన్స్ కావాలంతే. రాహుల్ తెవాటియా() జతగా ఫిలిప్స్ గెలుపు బాధ్యత తీసుకున్నాడు. కార్తిక్ త్యాగి ఓవర్లో అతడు వరసగా రెండు ఫోర్లు బాదాడు. చివరి ఓవర్లో విజయానికి 5 పరుగులు అవసరమవ్వగా.. తొలి బంతికే ఫిలిప్స్ ఔటయ్యాడు. ఇంప్యాక్ట్ ప్లేయర్ షారుక్ ఖాన్, తెవాటియాలు పెద్ద షాట్లకు ప్రయత్నించకుండా సింగిల్స్, డబుల్స్ తీసి గుజరాత్‌ను గెలిపించారు. ఐపీఎల్ వేలంలో అత్యధిక ధర పలికిన కామెరూన్ గ్రీన్(79) ఎట్టకేలకు చెలరేగాడు. అహ్మదాబాద్‌లో ఆదిలోనే కష్టాల్లో పడిన కోల్‌కతా నైట్ రైడర్స్‌ను అర్ధ శతకంతో ఆదుకున్నాడు. గుజరాత్ టైటాన్స్ పేసర్లు రబడ(3-29), సిరాజ్(2-23)ల ధాటికి కోల్‌కతా టాపార్డర్ కుప్పకూలినా.. పావెల్(17)తో కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దాడు. ప్రసిధ్ కృష్ణ, అశోక్ శర్మలు సైతం ఇబ్బంది పెట్టగా.. రింకూ సింగ్(1), రమన్‌దీప్ సింగ్(17), సునీల్ నరైన్(0)లు విఫలమయ్యారు. ఓవైపు వికెట్లు పడుతున్నా రమన్‌దీప్ సింగ్(17) రాణించగా.. చివరిదాకా క్రీజులో నిలిచినా భారీ స్కోరందించలేకపోయాడు. రషీద్ ఖాన్ వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్ ఆఖరి బంతికి అతడు వెనుదిరగగా కోల్‌కతా 180 పరుగులకు ఆలౌటయ్యింది.



# చెన్నై జట్టులోకి ఆకాశ్ మధ్వల్

సీఎస్‌కే బౌలర్ ఖలీల్ అహ్మద్ తొడ కండరాల గాయానికి గురయ్యాడు. అతను కోలుకోవడానికి 10 నుంచి 12 వారాల సమయం పట్టనుండడంతో ఖలీల్ అహ్మద్ దాదాపు సీజన్ మొత్తానికి దూరమైనట్లే. అందుకే సీఎస్‌కే ఖలీల్ స్థానంలో ఆకాశ్‌ను జట్టులోకి తీసుకోనుంది. అయితే శనివారం సీఎస్‌కే ఎస్ఆర్‌హెచ్‌తో మ్యాచ్ ఆడనుంది. ఇక తొలుత ముంబై ఇండియన్స్‌కు నెట్ బౌలర్‌గా వ్యవహరించిన ఆకాశ్ మధ్వల్ 2023 ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌కు కీలక బౌలర్‌గా ఉన్నాడు. ఆ సీజన్‌లో 8 మ్యాచ్‌లాడిన ఆకాశ్ 14 వికెట్లు పడగొట్టాడు. లక్నో సూపర్‌జెయింట్స్‌తో జరిగిన ప్లేఆఫ్స్ మ్యాచ్‌లో ఆకాశ్ మధ్వల్ 5 పరుగులకే 5 వికెట్లు పడగొట్టి సంచలన ప్రదర్శన నమోదు చేశాడు.

# కివీస్‌దే తొలి వన్డే

## బంగ్లాతో వన్డే సిరీస్

బంగ్లాదేశ్ టూర్‌ను న్యూజిలాండ్ ఘనంగా ఆరంభించింది. ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన తొలి వన్డేలో న్యూజిలాండ్ 26 పరుగుల తేడాతో విజయం సాధించింది. మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. హెన్రీ నికోలస్ (68) టాప్ స్కోరర్‌గా నిలవగా, డియాన్ ఫాక్స్ క్రాఫ్ట్ (59) అర్ధసెంచరీ సాధించాడు. బంగ్లా బౌలర్లలో రిషద్ హొసెన్, షోరిఫుల్ ఇస్లామ్, తస్కిన్ అహ్మద్‌లు తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 48.3 ఓవర్లలో 221 పరుగులకు ఆలౌటైంది. సైఫ్ హసన్ (57), తౌహిద్ హృదోయ్ (55) అర్ధసెంచరీలు సాధించారు. లిటన్ దాస్ (46) పర్వాలేదనిపించాడు. అయితే వీరు ఔటైన తర్వాత బంగ్లా ఇన్నింగ్స్ పేకమేడను తలపించింది. న్యూజిలాండ్ బౌలర్లలో బ్లెయిర్ టిక్నర్ 4 వికెట్లతో చెలరేగగా, నాథన్ స్మిత్ 3 వికెట్లు తీశాడు. బ్యాటింగ్‌లో అర్ధసెంచరీ, బౌలింగ్‌లో ఒక వికెట్ తీసి ఆల్‌రౌండ్ ప్రదర్శన కనరబరిచిన డియాన్ ఫాక్స్‌క్రాఫ్ట్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. ఇరుజట్ల మధ్య రెండో వన్డే సోమవారం జరగనుంది.

# టీమిండియాలోకి ప్రభ్ సిమ్రన్!



ఐపీఎల్ పుణ్యమాని టీమిండియాకు ప్లేయర్ల కొరత అస్సలు లేకుండా పోయింది. ఒకప్పుడు జట్టు కూర్పు అనేది సెలెక్టర్లకు తలనొప్పిగా తయారయ్యేది. అయితే ఐపీఎల్‌లో లోకల్ టాలెంట్ బయటపడుతుండటంతో సెలెక్టర్లకు జట్టు ఎంపిక చాలా సులభతరంగా మారింది. ఇక ఈ సీజన్‌లో ప్రభ్‌సిమ్రన్ సింగ్ ప్రదర్శన చూస్తుంటే టీమ్ ఇండియాకు మరో బలమైన వికెట్ కీపర్ ఆప్షన్ దొరికినట్లు కనిపిస్తోంది. 25 ఏళ్ల ఈ యువ ఆటగాడు ఈ ఐపీఎల్‌లో ఆడిన 5 మ్యాచ్‌ల్లో 70.33 సగటుతో 211 పరుగులు చేశాడు.అతని స్ట్రైక్ రేట్ (172.95) అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. బ్యాటింగ్‌లోనే కాకుండా వికెట్ల వెనుక కూడా మూడు మెరుపు క్యాచ్‌లతో చురుకుదనం ప్రదర్శించాడు. ప్రభ్‌సిమ్రన్ సింగ్‌ను 2019లో పంజాబ్ కింగ్స్ జట్టు తొలిసారిగా తీసుకుంది. ఆ తర్వాత 2022 వేలంలో అతడిని ▯60 లక్షలకు తిరిగి కొనుగోలు చేసింది. 2023లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై 103 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఆ సీజన్‌లో 358 పరుగులు సాధించాడు.

# ఆర్ఆర్ మేనేజర్‌కు రూ.లక్ష జరిమానా

ఐపీఎల్ 2026 సీజన్లో భాగంగా గౌహతిలో రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రాజస్థాన్ రాయల్స్ టీమ్ మేనేజర్ రోమీ భిందర్ డగౌట్లో కూర్చొని మొబైల్ ఫోన్ వాడుతున్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఐపీఎల్ రూల్స్ ప్రకారం.. మ్యాచ్ జరుగుతున్న సమయంలో డగౌట్లో కమ్యూనికేషన్ పరికరాలను వాడటం నిషేధం. దీనిపై స్పందించిన బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం వెంటనే విచారణ చేపట్టింది. ఈ ప్రోటోకాల్ ఉల్లంఘనపై వివరణ కోరుతూ బీసీసీఐ రోమీ భిందర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దీనిపై ఆయన స్పందిస్తూ.. తనకు ఉన్న ఆరోగ్య సమస్యల కారణంగానే అత్యవసరంగా ఫోన్ వాడాల్సి వచ్చిందని వివరణ ఇచ్చారు. రోమీ భిందర్ వాదనతో సంతృప్తి చెందిన ఏసీఎస్‌యూ ఇన్వెస్టిగేటర్లు, ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన తప్పు కాదని భావించారు. దీంతో ఆయనపై కఠిన చర్యలు తీసుకోకుండా కేవలం జరిమానా విధించి, భవిష్యత్తులో ఇలా జరగకూడదని హెచ్చరికతో వదిలేశారు.

# 2030 నాటికి వైభవ్ ధర రూ.150 కోట్లు

ఐపీఎల్ వ్యవస్థాపకుడు, మాజీ అధ్యక్షుడు లలిత్ మోదీ మరోసారి తన కామెంట్లతో వార్తల్లో నిలిచారు. ప్రపంచంలోనే అత్యంత సంపన్న క్రికెట్ లీగ్‌గా పేరుగాంచిన ఐపీఎల్.. భవిష్యత్తులో మరింత భారీగా విస్తరించబోతోందని ఆయన అంచనా వేశారు. 2030 నాటికి ఐపీఎల్ ఆర్థిక ముఖచిత్రం ఊహించని రీతిలో మారుతుందని.. ప్లేయర్లపై కాసుల వర్షం కురుస్తుందని లలిత్ మోదీ ధీమా వ్యక్తం చేశారు. లలిత్ మోదీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. రాబోయే నాలుగేళ్లలో ఐపీఎల్ జట్ల బడ్జెట్ ఏకంగా 7 రెట్లు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఒక్కో ఫ్రాంచైజీకి ఉన్న రూ. 125 కోట్ల బడ్జెట్ (పర్స్ వాల్యూ).. 2030 నాటికి సుమారు 100 మిలియన్ డాలర్లకు (దాదాపు రూ. 932 కోట్లు) చేరుకుంటుందని ఆయన జోస్యం చెప్పారు. దీనివల్ల ప్రపంచంలోని మేటి ఆటగాళ్లు ఒక్కో సీజన్‌కు ఏకంగా రూ. 150 కోట్ల వరకు సంపాదించే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. 'ద ఓవర్‌లాప్ క్రికెట్'తో మాట్లాడిన లలిత్ మోదీ.. భవిష్యత్తులో ఆటగాళ్ల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని విశ్లేషించారు. టాప్ ప్లేయర్లు ఆడే ఒక్కో మ్యాచ్ విలువ సుమారు 1 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 8.5 నుండి 9 కోట్లు) ఉండవచ్చని ఆయన అంచనా వేశారు. ప్రస్తుతం ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ధర పలికిన ఆటగాడిగా రిషబ్ పంత్ (రూ. 27 కోట్లు - లక్నో సూపర్ జెయింట్స్) నిలవగా.. లలిత్ మోదీ అంచనా ప్రకారం భవిష్యత్తులో ఈ రికార్డులు ఎక్కడికో చేరుకుంటాయి. ఒకవేళ లలిత్ మోదీ అంచనాలు నిజమైతే, వైభవ్ సూర్యవంశీ, జాకబ్ బెథెల్ వంటి యువ ఆటగాళ్లకు అది గొప్ప వరంగా మారనుంది. దీర్ఘకాలం పాటు లీగ్‌లో కొనసాగే అవకాశం ఉన్న యంగ్ టాలెంట్‌కు కోట్ల రూపాయల ఆదాయం లభిస్తుంది. కేవలం స్టార్ ప్లేయర్లు మాత్రమే కాకుండ.. సాధారణ ఆటగాళ్లు కూడా ప్రతి మ్యాచ్‌కూ కోట్ల రూపాయలు ఆర్జించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.






# బ్లాక్ మార్కెట్‌లో టికెట్లు.. క్యాంటీన్ వ్యక్తి అరెస్టు

ఐపీఎల్ టికెట్ల కోసం అభిమానులు ఎంతో శ్రమపడుతుంటారు. ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో టికెట్ల కోసం పోటీపడతారు. ఇదే అదనుగా కొందరు చేతివాటం చూపిస్తున్నారు. ఒక్కో టికెట్‌పై వేలకు వేలు దండుకుంటూ అవినీతికి తెరతీస్తున్నారు. తాజాగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్ టికెట్లను ఓ వ్యక్తి బ్లాక్‌లో అమ్ముకున్నాడు. చిన్నస్వామి స్టేడియం క్యాంటీన్‌లో పనిచేస్తున్న అతడు.. వంద టికెట్లను బ్లాక్‌లో భారీ ధరకు అమ్ముతూ పోలీసులకు చిక్కాడు. నిరుడు తొక్కిసలాటతో క్రికెట్‌కు దూరమైన చిన్నస్వామి స్టేడియంలో పది నెలల తర్వాత ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఆర్సీబీ అదరగొడుతోంది. దాంతో, ఆ జట్టు మ్యాచ్ టికెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి. అయితే.. ఈ సమయంలోనే బ్లాక్ మార్కెట్లో టికెట్లు అమ్మకం కలకలం రేపింది. చిన్నస్వామి స్టేడియంలో ఏప్రిల్ 15న ఆర్సీబీ, లక్నో సూపర్ జెయింట్స్ తలపడ్డాయి. అక్కడి క్యాంటీన్‌లో పనిచేసే చంద్రశేఖర్ అనే వ్యక్తి ఈ మ్యాచ్ టికెట్లను బ్లాక్‌లో అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. ఒక్కో టికెట్‌ను రూ.15,000 నుంచి రూ.19,000లకు అమ్ముతున్న అతడు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. అనంతరం విచారణలో కర్నాటక క్రికెట్ సంఘం సభ్యుల్లో ఒకడైన గణేశ్ పరీక్షిత్ తనకు టికెట్లు ఇస్తాడని, తాను వాటిని బ్లాక్‌లో అమ్ముతానని చంద్రశేఖర్ వెల్లడించాడు. దాంతో, కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు.

ఈవార్తలు
# ప్రజావాణి
శనివారం 18-4-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# ..భారతీయతలో భిన్నత్వం!?

భారతదేశం కేవలం ఒక భౌగోళిక భూభాగం మాత్రమే కాదు; అసంఖ్యాక భాషలు, సంస్కృతులు, ఆచారాల మేళవింపుతో కూడిన ఒక సజీవ అద్భుతం. "భిన్నత్వంలో ఏకత్వం" అనేది మన దేశ ఆత్మ. అయితే, దురదృష్టవశాత్తూ ప్రస్తుత రాజకీయ పరిణామాలు ఈ ఆత్మను గాయపరుస్తున్నాయి. రాజకీయ లబ్ధి కోసం కొందరు నాయకులు 'ఉత్తర భారతదేశం' వర్సెస్ 'దక్షిణ భారతదేశం' అనే విభజన రేఖను గీయడం అత్యంత ప్రమాదకరమైన ధోరణి. దేశాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాల భాగస్వామ్యం, పన్నుల వాటా, జనాభా నియంత్రణ వంటి అంశాలను సాకుగా చూపుతూ విద్వేషాలను రగల్చడం బాధ్యతారాహిత్యం. మరోవైపు, ఉత్తరాది ఆధిపత్యాన్ని రుద్దే ప్రయత్నం జరుగుతోందన్న ఆందోళనలను పెంచి పోషించడం ద్వారా ప్రాంతీయ విభేదాలను రాజకీయ పెట్టుబడిగా మార్చుకుంటున్నారు. ఆర్థిక వనరుల పంపిణీ లేదా నియోజకవర్గాల పునర్విభజన వంటి రాజ్యాంగబద్ధమైన అంశాలపై ఆరోగ్యకరమైన చర్చ జరగాలి కానీ, అది రెండు ప్రాంతాల ప్రజల మధ్య శత్రుత్వాన్ని పెంచేలా ఉండకూడదు. రాజకీయ నాయకుల వాగ్ధాటి ఓట్ల వేటలో హద్దులు దాటుతోంది. ఒక ప్రాంతాన్ని తక్కువ చేస్తూ మాట్లాడటం లేదా మరొక ప్రాంతంపై వివక్ష జరుగుతోందని రెచ్చగొట్టడం ద్వారా వారు దేశ సమైక్యతను పణంగా పెడుతున్నారు. అధికారం కోసం అశాంతిని సృష్టించడం ప్రజాస్వామ్యానికి చేటు. అభివృద్ధి చెందిన రాష్ట్రాలు వెనుకబడిన రాష్ట్రాలకు అండగా నిలవడం సమాఖ్య స్ఫూర్తిలో భాగం. అలాగే, ప్రతి ప్రాంతపు భాషా, సాంస్కృతిక అస్తిత్వాన్ని గౌరవించడం కేంద్రం బాధ్యత. గతంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు సమయంలోనూ ఇలాంటి ఉద్రిక్తతలు తలెత్తాయి. కానీ నాటి నాయకత్వం దూరదృష్టితో సమస్యలను పరిష్కరించింది. నేటి నాయకులు మాత్రం మంటలను ఆర్పాల్సింది పోయి, తమ స్వార్థం కోసం ఆజ్యం పోస్తున్నారు. భారత రాజ్యాంగం మనందరికీ ఒకటే పౌరసత్వాన్ని ఇచ్చింది. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఉన్న ప్రతి భారతీయుడు ఈ దేశ వారసుడే. ఇప్పటికైనా రాజకీయ పక్షాలు తమ సంకుచిత ప్రయోజనాలను పక్కన పెట్టాలి. ప్రాంతీయ భావోద్వేగాలతో ఆడుకోవడం అంటే అగ్నితో చెలగాటమాడటమే. అభివృద్ధి, విద్య, ఉపాధి వంటి అంశాలపై పోటీ పడాలి కానీ, ద్వేషాన్ని పంచడంలో కాదు. భారత మాత ముద్దుబిడ్డల మధ్య గోడలు కట్టే ప్రయత్నాన్ని ప్రజలు కూడా తిప్పికొట్టాలి. దేశ సమగ్రతను కాపాడుకోవడం మనందరి బాధ్యత.



# ప్రతి పైసా భవిష్యత్తు రాబడి

**ప్రస్తుతం భారత ఈక్విటీ మార్కెట్లలో కనిపిస్తున్న ఒడిదుడుకులు ప్రధానంగా అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితుల వల్ల ఏర్పడినవే తప్ప, మన దేశీయ ఆర్థిక బలహీనతల వల్ల కాదు. స్థిరమైన ఆర్థిక లోటు, పటిష్టమైన జీడీపీ వృద్ధి రేటుతో భారత ఆర్థిక పునాదులు చాలా బలంగా ఉన్నాయి. భారత ఆర్థిక స్థితిగతుల్లో వచ్చిన అతిపెద్ద మార్పు చమురు దిగుమతి బిల్లు తగ్గడం. గతంలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 130-140 డాలర్లు ఉన్నప్పుడు మన జీడీపీలో 5% వరకు దీనికే ఖర్చయ్యేది, కానీ నేడు అది 2% కన్నా తక్కువకు చేరుకుంది.**



**పిట్ల విజయేందర్ రెడ్డి**
స్టాక్ మార్కెట్ అనలిస్టు, హైకోర్టు అడ్వొకేట్
ఫోన్ నంబర్: 9666090715

ముడి చమురును దిగుమతి చేసుకుంటున్నప్పటికీ, భారతదేశం నేడు ప్రపంచ స్థాయి రిఫైనింగ్ హబ్‌గా ఎదిగింది. ఏటా 85 బిలియన్ డాలర్ల విలువైన పెట్రోలియం ఉత్పత్తులను ఎగుమతి చేస్తూ, దేశంలోనే రెండో అతిపెద్ద ఎగుమతి రంగంగా నిలిచింది. నిరంతరాయంగా సాగుతున్న వ్యవస్థాగత సంస్కరణలు దీర్ఘకాలిక లాభాలకు మార్గం సుగమం చేస్తున్నాయి. నియంత్రణ, ఆర్థిక విధానాలు జీఎస్టీ, ఐబీసీ, రెరా వంటి చట్టాలు వ్యాపార లావాదేవీలను క్రమబద్ధీకరించి, పారదర్శకతను పెంచాయి. రైల్వేలు, రోడ్లు, విమానయాన రంగాల్లో పెరుగుతున్న పెట్టుబడులతో పాటు ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్(పీఎల్ఐ) పథకాలు భారతదేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మారుస్తున్నాయి. జామ్ ట్రినిటీ (జన్ ధన్-ఆధార్-మొబైల్), వేగవంతమైన డిజిటలైజేషన్ వల్ల సామాన్యులకు కూడా పెట్టుబడి మార్కెట్లు అందుబాటులోకి వచ్చాయి. భారతదేశంలో పొదుపు మొత్తాలను ఆర్థిక మార్కెట్లలో పెట్టుబడిగా మార్చే ధోరణి మునుపెన్నడూ లేనంతగా పెరిగింది. డీమ్యాట్ ఖాతాల సంఖ్య 3.5 కోట్ల నుండి 12 కోట్లకు చేరగా, ప్రతి నెలా ఎస్ఐపీల ద్వారా రూ.24,000 కోట్ల పైగా పెట్టుబడులు వస్తున్నాయి. ఇది విదేశీ పెట్టుబడిదారులు వెనక్కి తగ్గినప్పుడు మన మార్కెట్‌ను స్థిరంగా ఉంచేందుకు రక్షణ కవచంలా పనిచేస్తోంది.

ప్రస్తుత గణాంకాలు, అంచనాలను పరిశీలిస్తే జీడీపీ వృద్ధి 7.8% - 8.2% అద్భుతమైన స్థాయిలో కొనసాగుతోంది. ద్రవ్యోల్బణం సుమారు 3.2% వద్ద సమర్థవంతంగా నిర్వహించబడుతోంది. కార్పొరేట్ కంపెనీల ఆదాయాల వృద్ధి 11.2% - 12.5%వరకు ఉంటుందని అంచనా, ఇది ప్రస్తుత పరిస్థితుల్లో కచ్చితంగా సాధించదగ్గ లక్ష్యం. 2019-20లో జీఎస్టీ వసూళ్లు రూ.12.22 లక్షల కోట్ల నుంచి 2024-25 నాటికి రూ.22 లక్షల కోట్లకు (అంచనా) చేరుకున్నాయి. రాబోయే 15-20 ఏళ్ల కాల పరిమితిని దృష్టిలో పెట్టుకునే వారికి, ప్రస్తుత మార్కెట్ తగ్గుదలలు ఒక అద్భుతమైన అవకాశం. పెట్టుబడిని విడతల వారీగా చేపట్టండి. నిఫ్టీ ప్రతి 400 పాయింట్లు పడిపోయినప్పుడల్లా నాణ్యమైన ఇండెక్స్ ఈటీఎఫ్‌లను కొనుగోలు చేసే విధానాన్ని పాటించండి. మార్కెట్ పట్ల తీవ్రమైన భయాందోళనలు ఉన్నప్పుడే పెట్టుబడి పెట్టడం ద్వారా దీర్ఘకాలంలో సంపదను సృష్టించవచ్చు. క్రమంగా పెట్టుబడి పెట్టడం వల్ల నష్టభయం తగ్గుతుంది, భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి నుండి మీరు పూర్తి ప్రయోజనం పొందవచ్చు.

# డిజిటల్ వల..
# సామాన్యుడు గిలగిల

**నేడు ప్రపంచం మన అరచేతిలో ఉంది. కేవలం ఒక స్మార్ట్‌ఫోన్‌తో బ్యాంకింగ్ నుంచి షాపింగ్ వరకు, విద్యాబోధన నుంచి వైద్య సేవల వరకు అన్నీ వేగంగా సాగిపోతున్నాయి. భారతదేశం 'డిజిటల్ ఇండియా' దిశగా అద్భుతమైన ప్రగతి సాధిస్తోంది. అయితే, ఈ వెలుగుల వెనుక 'సైబర్ నేరం' అనే ఒక చీకటి సామ్రాజ్యం అంతే వేగంగా విస్తరిస్తోంది.**



**రణధీర్ గుండు**



నేడు దేశవ్యాప్తంగా పసిపిల్లల నుంచి పండు ముసలి వరకు, నిరక్షరాస్యుల నుంచి ఉన్నత విద్యావంతుల వరకు ఎవరూ ఈ నేరాల బారి నుంచి తప్పించుకోలేకపోతున్నారు. విచారించదగ్గ విషయం ఏమిటంటే, నేరం జరిగినప్పుడు బాధితులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వ వ్యవస్థలు కేవలం ఒక్కో కేసును విడివిడిగా పరిశీలించడానికే పరిమితమవుతున్నాయి తప్ప, ఈ మహమ్మారిని వేళ్లతో సహా పెకిలించే ఒక పటిష్టమైన జాతీయ విధానాన్ని రూపొందించడంలో విఫలమవుతున్నాయి. వ్యవస్థాగత లోపాల వల్ల దాన్ని అరికట్టే విధానం రూపుదిద్దుకోలేకపోతోంది. సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడానికి ఒక సమగ్ర జాతీయ విధానం లేకపోవడానికి ప్రధానంగా ఐదు కారణాలు కనిపిస్తున్నాయి.

1. కేంద్రీకృత వ్యవస్థ లేకపోవడం: ప్రస్తుతం సైబర్ నేరాల నియంత్రణ బాధ్యత వివిధ సంస్థల మధ్య విభజించబడి ఉంది. వీటి మధ్య సమన్వయం లోపించడం వల్ల నేరగాళ్లు సులభంగా తప్పించుకుంటున్నారు.

2. చట్టపరమైన పరిమితులు: మన ప్రధాన చట్టమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) యాక్ట్, 2000 పాతబడిపోయింది. 2008లో సవరణలు చేసినప్పటికీ, నేటి అత్యాధునిక ఏఐ ఆధారిత నేరాలను ఎదుర్కోవడానికి ఇది సరిపోవడం లేదు.

3. రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదాలు: రాజ్యాంగం ప్రకారం 'పోలీస్' అనేది రాష్ట్రాల జాబితాలోని అంశం. సైబర్ నేరాలు భౌగోళిక సరిహద్దులు లేకుండా జరుగుతాయి. ఒక రాష్ట్రంలో ఉండి మరో రాష్ట్రంలోని వ్యక్తిని మోసం చేసినప్పుడు, ఏ రాష్ట్ర పోలీస్ చర్య తీసుకోవాలనే దానిపై స్పష్టత లేకపోవడంతో విచారణ మందగిస్తోంది.

4. సాంకేతిక నైపుణ్యం లోపం: పోలీస్ శాఖలో సైబర్ నేరాలను ఛేదించే స్థాయి సాంకేతిక నిపుణుల కొరత 70% కంటే ఎక్కువగా ఉంది. క్షేత్రస్థాయిలోని కానిస్టేబుళ్ల నుంచి అధికారుల వరకు అందరికీ డిజిటల్ ఫోరెన్సిక్స్‌పై సరైన శిక్షణ లేదు.


5. డేటా సార్వభౌమాధికారం: దాదాపు 70% కంటే ఎక్కువ డేటా విదేశీ సర్వర్లలో (క్లౌడ్) నిక్షిప్తమై ఉంటుంది. దర్యాప్తు సమయంలో ఈ డేటాను పొందడానికి విదేశీ సంస్థల సహకారం కోసం నెలల తరబడి వేచి చూడాల్సి వస్తోంది.

పిల్లల నుంచి వృద్ధుల దాకా సైబర్ నేరగాళ్ల దృష్టిలో బాధితుడి హోదా ముఖ్యం కాదు, కేవలం లొసుగులు మాత్రమే ముఖ్యం. గేమింగ్ యాప్‌లు, సోషల్ మీడియా ద్వారా పిల్లలు లైంగిక వేధింపులు, సైబర్ బుల్లీయింగ్‌కు పిల్లలు అధికంగా గురవుతున్నారు. పెన్షన్ అప్‌డేట్, కేవైసీ పేరుతో వచ్చే ఫేక్ కాల్స్ ద్వారా వృద్ధులు తమ జీవితకాల కష్టార్జితాన్ని సెకన్లలో కోల్పోతున్నారు. ఆశ్చర్యకరంగా, విద్యావంతులే పెట్టుబడి మోసాలు, పార్ట్ టైమ్ జాబ్ స్కామ్‌లలో ఎక్కువగా చిక్కుకుంటున్నారు. ప్రభుత్వం ×4సీ (ఇండియన్ సైబర్ క్రైం కో ఆర్డినేషన్ సెంటర్), 1930 హెల్ప్‌లైన్ వంటి చర్యలు చేపట్టింది. 2024లో 'సస్పెక్ట్ రిజిస్ట్రీ', 'సహయోగ్ పోర్టల్' వంటివి ప్రారంభమైనప్పటికీ, ఇవి కేవలం జరిగిన నేరాలను నివేదించడానికే ఉపయోగపడుతున్నాయి కానీ, నేరాలను అడ్డుకోవడంలో పెద్దగా ప్రభావం చూపడం లేదు. అందుకే, దేశవ్యాప్తంగా ఒకే నియమ నిబంధనలతో పనిచేసే 'నేషనల్ సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ'ని యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలి. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక 'సైబర్ వారియర్స్' ఉండాలి, వారికి అత్యాధునిక సాఫ్ట్‌వేర్ పరికరాలు అందించాలి. సైబర్ నేరాలను నాన్-బెయిలబుల్ అఫెన్స్‌గా పరిగణిస్తూ కొత్త చట్టాన్ని తీసుకురావాలి. ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం కాకుండా, పాఠశాల స్థాయి నుంచే 'డిజిటల్ సెక్యూరిటీ'ని ఒక పాఠ్యాంశంగా చేర్చాలి. టెక్నాలజీ మారుతున్న వేగానికి అనుగుణంగా ప్రభుత్వ విధానాలు మారనంత కాలం సామాన్యుడు సైబర్ నేరగాళ్ల చేతిలో బలైపోతూనే ఉంటాడు. తక్షణమే ఒక సమగ్రమైన, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన జాతీయ విధానాన్ని రూపొందించడమే ఈ సమస్యకు ఏకైక శాశ్వత పరిష్కారం.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.